

జోగిపేటలో బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట పట్టణంలో గురువారం బతుకమ్మ పండుగను ప్రజలు సంతోషంగా జరిపారు. స్థానిక మార్కెట్, బృందావన్ కాలనీలో బతుకమ్మలను ఉంచి ఆటపాటలతో సంతోషంగా గడిపారు. కాగా మార్కెట్ దగ్గర జరిగిన వేడుకల్లో మాజీమంత్రి బాబుమోహన్ పాల్గొన్నారు. అనంతరం చెరువు వద్ద డాకూరి గాలయ్య గారి వెంకటేశం ఆధ్వర్యంలో వాటర్ ప్యాకెట్ల పంపిణీ చేపట్టారు. 17వ వార్డులో కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు సీడబ్ల్యూసీ మెంబర్ దామోదర్ రాజనర్సింహ మెంబర్ త్రిష హాజరయ్యారు.

1

నవతెలంగాణ

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 20 అక్టోబర్ 2023 | www.navatelangana.com

గడప గడపకు కాంగ్రెస్



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని మేళాసంఘం, లింగంపల్లి, అంతరం, పెద్దచెల్మడా, మన్సాన్‌పల్లి గ్రామాల్లో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల గూర్చి ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ప్రజలందరూ విసిగి పోయా రన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ప్రస్తుతం ప్రజలందరూ కాంగ్రెస్‌నే అని కోరుకుంటున్నారన్నారు. ఈసారి దామోదర రాజనర్సింహను భారీ మెజారిటీతో గెలిపించి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సతీష్,మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి,కార్యకర్తలు పాల్గొన్నారు.



పోలీస్ అధికారులు 24/7 అందుబాటులో ఉండాలి

జిల్లా ఎస్పీ సిహెచ్.రూపేష్

నవతెలంగాణ-సంగారెడ్డి

పోలీస్ అధికారులు, సిబ్బంది 24/7 అందుబాటులో ఉండాలని జిల్లా ఎస్పీ సిహెచ్. రూపేష్ అన్నారు. మంత్లీ క్రైమ్ రివ్యు మీటింగ్‌లో భాగంగా గీతం ఇంజనీరింగ్ కళా శాల రుద్రారంలో పోలీస్ అధికారులతో నెల వారి నేర సమీక్షా, ఎలెక్షన్ మీటింగ్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రానున్న జనరల్ ఎలక్షన్స్‌ను దృష్టిలో ఉంచుకొని పోలీస్ అధికారులు, సిబ్బంది 24/7 అందుబాటులో ఉండాలని, ఎన్నికల నియమావళిని అందరు తెలుసుకొని వుండి, తప్పకుండా పాటించాలన్నారు. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చిన నాటి నుండి అందరం ఎన్నికల కమిషన్ ఆధీనంలో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. సిబ్బంది ఎవరూ కూడా విధినిర్వాహణలో అలసత్వం చూపొ ద్దన్నారు. జిల్లా వ్యాప్తంగా వున్న ప్రతీఒక్క పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. ఎస్‌హెచ్‌ఒలు తమ ఏరియాలో గల ప్రతీ ఒక్క పోలింగ్ స్టేషన్‌ను సంద ర్శించి, పోలింగ్ రోజు సిబ్బందికి, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాల నుండి మద్యం, నగదు గాని సరఫరా జరగకుండా అరికట్టేందుకు గాను ఇంట్రెస్ట్ బోర్డర్ చెక్ పోస్ట్ (09) లను, ఇతర జిల్లాలతో సరిహద్దు కలిగిన ప్రాంతాల్లో (08) చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనితోపాటు ఎస్‌హెచ్‌ఓలు ప్రతిరోజు తమ తమ ఏరియాలలో చెక్ పోస్ట్ నిర్వహిస్తూ ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. గత ఎలక్షన్లలో అల్లర్లు సృష్టించిన వారిని, చెడు ప్రవర్తన గల మొత్తం 1000 మందిని సత్ప్రవర్తన కోరుతూ ముందస్తుగా బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున ఇతర పార్టీలను గాని లేదా వ్యక్తులను గాని కించపరిచే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినా.. ఆ వ్యక్తులపై చట్టరిత్యా చర్యలు తీసుకుం టామన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా జిల్లా ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం ఆయా పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో (అండర్ ఇన్వెస్టిగేషన్) ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, నేరస్తులను న్యాయ స్థానం ముందు హాజరుపరచాలని ఎస్‌హెచ్‌ఒలకు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ అశోక్, రాములు నాయక్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, సంగారెడ్డి డీఎస్పీ రమేష్ కుమార్, జహీరాబాద్ డీఎస్పీ రఘు, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తం, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ, ఇనస్పెక్టర్ బి.రమేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శివలింగం, జిల్లా సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

లెక్క సరే.. తిప్పలేంటే..!



బుధవారం జహీరాబాద్ చెక్‌పోస్ట్ వద్ద..

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అనేక రూపాల్లో ప్రయత్నిస్తున్నారు. నగదు పంపిణీ, బంగారం, వెండి, మద్యం, ఇతర వస్తువుల్ని పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. పాలక పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎన్నికల కోసం డబ్బులు, నగలు, ఇతర వస్తువుల్ని తరలిస్తున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమైనందున అక్రమంగా డబ్బు, ఇతర వస్తువుల రవాణాపై ఈసీ దృష్టి సారించింది. షెడ్యూల్ విడుదలైన రోజున్నే తనఖీలు షురూ చేసింది. రోజూ నగదు, బంగారం, వెండి, మద్యం, డ్రగ్స్ ఇతర వస్తువులు పట్టుపడుతున్నాయి. ఇదంతా ఎన్నికల్లో జరిగే ప్రక్రియే అయినప్పటికీ కామన్ మ్యాన్ సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. వరి, పత్తి ఇతర పంట దిగుబడులు వస్తున్నందున వాటిని అమ్ముకుని సొమ్ము తీసుకెళ్దామంటే రైతుల్లో గుబులు మొదలైంది. మద్యం, బంగారం, బట్టలు, ఎలక్ట్రికల్ వ్యాపారులు, ఆసుపత్రులలో నిత్యం లక్షలాది నగదు వస్తుంది. అట్టి డబ్బును ఇంటికి, బ్యాంకుకు తీసుకెళ్లడం కష్టంగా మారిందని వాపోతున్నారు.

- నగదు, వస్తువుల తరలింపుపై నిఘా
- రూ.50వేలకు మించితే పత్రాలుండాల్సిందే
- మొదలైన వరి, పత్తి పంట విక్రయాలు
- నగదు తీసుకెళ్తే పట్టుకుంటారని రైతుల్లో గుబులు
- మద్యం, ఇతర వ్యాపారులదీ అదే పరిస్థితి
- సీజ్ చేశాక లెక్క చూపేందుకు గ్రీవెన్స్ కమిటీ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట జిల్లాల్లోని 11 నియోజకవర్గాల్లో డబ్బు, బంగారం, వెండి, ఇతర వస్తువుల్ని పెద్ద ఎత్తున ఓటర్లకు పంచే అవకాశముంది. అందు కోసం ఆయా పార్టీల అభ్యర్థులు వాటిని నియోజకవర్గాలకు తరలిస్తున్నారు. నమ్మకస్తులనే వ్యక్తుల ద్వారా రూట్ మారుస్తూ ముందే అనుకున్న చోటికి వాటిని తరలిస్తున్నారు. మద్యం, డబ్బు రవాణాపై ఈసీ నజర్ పెట్టింది. విస్తృతంగా తనిఖీలు చేసి పట్టుకుంటున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు పెట్టి క్షుణంగా వాహనాల్ని తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో కోట్ల రూపాయల్ని పట్టుకున్నారు. బంగారం, వెండి, ఇతర వస్తువుల్ని తరలిస్తుంటే పట్టుకున్నారు. అక్రమంగా డబ్బు, మద్యం తరలించే వాళ్లసైతం పోలీసుల తనిఖీల్ని తప్పించుకు నేందుకు అనేక ప్లాన్స్ వేస్తున్నారు. కార్లు కాకుండా ఇతర వాహనాల్లో వీటిని తరలిసు _న్నారు. పోలీస్ నిఘా లేని రూట్లల్లో తరలిస్తున్నారు. ఇందు కోసం ఈసీ మరింత కట్టుదిట్టమైన తనిఖీలకు పురమాయించడంతో పోలీసులు తనిఖీలను పెంచారు. ఇంటర్ డిస్ట్రిక్స్ చెక్‌పోస్టులు పెట్టారు.

తనిఖీలు సరే.. ఇబ్బందులేంటీ..?

డబ్బు, మద్యం, ఇతర వస్తువుల్ని అక్రమంగా తరలి స్తుంటే అరికట్టాల్సిందే. కానీ..! తనిఖీల పేరిట ఇబ్బందులు పెట్టడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. సంపన్నమైన కుటుంబాలు డబ్బు, నగలతో ప్రయాణాలు చేస్తున్నారు. అలాగే రోజువారి వ్యాపారంలో వచ్చే డబ్బుల్ని తీసుకెళ్లే విషయంలోనూ ఇబ్బందులెదుర్కోవాల్సి వస్తుంది. మద్యం దుకాణాల కౌంటర్లలో రోజువారి లక్షల రూపాయల నగదు వస్తుంది. పెట్రోల్ బంకులు, బంగారం దుకాణాలు, పండగ సీజన్ కావడంతో బట్టలు, టీవీ, సెల్స్ ఇతర వస్తువుల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఎన్నికల వేళ అయిన ందున వ్యాపారాలు మరింత ఎక్కువ సాగుతున్నాయి. దీంతో రోజువారిగా వచ్చే కలెక్షన్ డబ్బుల్ని ఇంటికి, బ్యాంకుకు తీసుకెళ్లాల్సి వచ్చినప్పుడు పోలీసుల తనిఖీ లు చేస్తు పట్టుకుంటున్నారు. అప్పటికప్పుడు లెక్కా పత్రాలు చూపించే అవకాశంలేక పోవడంతో పోలీసులు డబ్బుల్ని తీసుకెళ్తున్నారు. పోలీసులు స్వాధినం చేసుకోవడంతో సదరు వ్యక్తులకు పొలిటికల్ ముద్ర పడి పలాన పార్టీ అభ్యర్థి కోసం తీసుకెళ్తున్నాడనే ప్రచారం జరుగుతుందని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు జాతీయ రహదారులున్నందున తరచూ ప్రాయాణాలు చేసే వాళ్లు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే డబ్బులు తీసుకెళ్లే విషయంలో మద్యం, ఇతర వ్యాపారులు ఎన్నికల కమిషన్‌ను కలిసి తమ సమస్యను విన్నవించారు. అదే విధంగా ఒక వ్యక్తి ఐదు 750 ఎంఎల్ పరిమాణం కల్గిన మద్యం సీసాలు లేదంటే 10 ఎంఎల్ బాటిళ్ల లేదా 20 క్వాటర్ సీసాలతో వ్యక్తిగతంగా తీసుకొని వెళ్లొచ్చు. 90 ఎంఎల్ కల్గిన 40 సీసాల వరకు రవాణా చేయొచ్చు. వీటికి కూడా కారణాలు అడిగి ఇబ్బందులు పెడుతున్నారని పలువు రు మద్యం ప్రియులు వాపోతున్నారు పంక్షన్లు, దావతులకు మద్యం తీసుకెళ్లినా సీజ్ చేస్తున్నారని పేర్కొంటున్నారు.

రైతులు, సామాన్యులకూ తిప్పలే..

ఇప్పటికే ఉమ్మడి మెదక్ జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటలు చేతికొస్తున్నాయి. పత్తి దిగుబడులు ఇప్పటికే వస్తున్నాయి. వరి కోతలు కూడా షురూ అయ్యాయి. ఐకేపీ, సీసీఐ కేంద్రాల్లో దిగుబడుల్ని అమ్ముకుంటేనే రైతు బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. మార్కెట్‌లో వ్యాపారులకు సరుకు అమ్ముకుంటే నగదు డబ్బులిస్తున్నారు. సరుకు అమ్ముకుంటే వచ్చిన డబ్బుల్ని తీసుకుని పోతుంటే పోలీసులు పట్టుకుని సీజ్ చేస్తారనే భయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాలో పత్తి విక్రయాలు సాగుతున్నారు. దసరా తర్వాత వరి కోతలు కూడా షురూ అవుతాయి. రైతులు పంట అమ్మిన డబ్బుల్ని తీసుకెళ్తే వాటిని సీజ్ చేయడం వల్ల ఇబ్బందులొస్తాయని రైతు సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. ఇప్పటికే వరంగల్ మార్కెట్‌లో పంట అమ్మిన రైతులు డబ్బుతీసుకెళ్తుంటే పోలీసులు సీజ్ చేసిన విషయం రైతుల్లో ఆందోళన పెంచుతుంది. సామాన్యులు సైతం ఆసుపత్రులు, ఇతర అవసరాల కోసం రూ.50 వేలకు మించి తీసుకెళ్లాల్సి వస్తే ఎక్కడ పోలీసులు పట్టుకుంటారో అన్న భయాందోళన నెలకొంది. హైదరాబాద్ నుంచి ముంబయి, కర్ణాటకు ఆసుపత్రులు, మార్కెట్ అవసరాల కోసం డబ్బుతో పోవాలంటే భయపడుతున్నారు.

గ్రీవెన్స్ కమిటీలు

పోలీసులు స్వాధినం చేసిన డబ్బుకు సంబంధించిన ఆధారాలు చూపి తీసుకెళ్లేందుకు గ్రీవెన్స్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శరత్ తెలిపారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీలో నోడ్ అధికారిగా డీసీఓ తుమ్మ ప్రసాద్, సభ్యులుగా డీటీఓ కవిత, డీఆర్‌డీఓ శ్రీనివాసరావును నియమించారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ గ్రీవెన్స్ కమిటీలు వేశారు. రూ.50 వేలకు మించి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్నా రవాణా చేస్తున్నా అట్టి నగదును సీజ్ చేస్తున్నారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించిన సదు వ్యక్తులు పూర్తి ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీ పరిశీలించి సరైన ఆధారులుంటే సీజ్ చేసిన నగదును విడుదల చేస్తారు. ఇందు కోసం 9100115691, 9281487272, 7799934135 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.



ఎన్నికల కోడ్ గాలికి!

- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-ఝరాసంగం

రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పటికీ.. కొన్ని గ్రామాల్లో తమకేమి పట్టనట్టు పలు శాఖల అధికారులు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల నియమావళిని బేఖాతరు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలలో ఉన్నప్పుడు ప్రభుత్వ కార్యాలయాలకు, రాజకీయ నాయకులకు సంబంధించిన పోస్టర్లు గాని, బ్యానర్లు గాని ఉండకూడదు. కానీ మండల పరిధిలోని ఏడాకులపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయానికి బీజేపీ వాల్ పోస్టర్ కట్ అవుట్‌గా వెలసింది. ఎన్నికల కోడ్ వెలువడి పది రోజులు గడుస్తున్నా ఆ శాఖ అధికారులు గాని, ఎన్నికల అధికారులు గానీ పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో ప్రతిరోజు పోలింగ్ బూత్‌లతోపాటు గ్రామ పరిసర ప్రాంతాలను పరిశీలించాల్సిన అధికారులు తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో స్వీప్ కార్యక్రమాలను విస్తృతం చేయాలి

- ఓటర్ అవేర్నెస్ ఫోరాలు ఏర్పాటు చేయాలి
- ఓటర్ టర్న్ అవుట్ తక్కువగా ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించాలి
- సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలో స్వీప్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని, ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా స్వీప్ యాక్షన్ ప్లాన్‌పై గురువారం సమీక్షించి, పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వేతర సంస్థలు, అన్ని పరిశ్రమలలో ఓటర్ అవేర్నెస్ ఫోరాలను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని రకాల పరిశ్రమలలో, మున్సిపాల్టీల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహిం చాలన్నారు. ఆయా ఏరియాలలో ప్రతి ఆర్గనైజేషన్ లో పనిచేస్తున్న అధికారులలో ఒకరిని నోడల్ అధికారిగా నియమించి ఓటు వినియోగంపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకో వాలన్నారు. వంద శాతం ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో, మండల, నియోజకవర్గం, మున్సిపాలిటీ కేంద్రాలలో, జిల్లా కేంద్రంలో ఓటు హక్కు వినియోగించు కోవడంపై ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో పోలింగ్ కేంద్రం స్థాయిలో చునావ్ పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్ టర్న్ అవుట్ తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఓటు వేయడం పై ప్రత్యేక అవగాహన సమా వేశాలు నిర్వహించాలని, విద్యార్థులకు, మహిళలకు రంగోలి పోటీలు నిర్వహించాలన్నారు. రైతులు, థర్డ్‌జెండర్, యువత, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్‌కు ఓటు హక్కు వినియోగించు కోవడం, ఈవీఎంపై ఓటు వేయడంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశం లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్ రెడ్డి, డిఆర్ఓ నగేష్ ,పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్ కుమార్, పశుసంవర్ధక శాఖ జేడి వసంత కుమారి, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, డీసీఓ ప్రసాద్, డీటీఓ కవిత, రిటర్నింగ్ అధికారులు, తదితర అధికారులు పాల్గొన్నారు.



'మోటార్లకు మీటర్లు' అంటూ తప్పుడు ప్రచారం

నవతెలంగాణ-రాయపోల్

దుబ్బాక నియోజకవర్గం ఉప ఎన్నికలలో బీజేపీకి ఓటు వేస్తే మోటార్లకు మీటర్లు వస్తాయని కేసిఆర్, హరీశ్‌రావ్‌లు తప్పుడు ప్రచారం చేశారని గ్రామాల్లో మీటర్లు వచ్చాయా అని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో దోచుకోవడం దాచుకోవడం తప్ప గరీబోళ్లకి చేసిందేమి లేదని ఎమ్మెల్యే అన్నారు. గురువారం రాయపోల్ మండలంలోని రాంసాగర్, ముంగిస్ పల్లి, వీరానగర్, అంకిరెడ్డి పల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలు గడుసున్నా రైతు రుణమాఫీ పూర్తి కాలేదని, రైతులకు అసలు కంటే వడ్డీ ఎక్కువైందని ఐదేళ్ల కిందనే రుణమాఫీ చేసి ఉంటే రైతులకు లాభం చేకూరేదని, రుణమాఫి వల్ల ఎవరికి లాభం లేదన్నారు. ఉప ఎన్నికలలో గెలిచిన రెండున్నర సంవత్సర కాలంలో అసెంబ్లీ సమావేశాలలో దుబ్బాక నియోజకవర్గం పేరు లేకుండా అసెంబ్లీ సమావేశాలు జరగలేదని, సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వంతో కొట్లాడడం జరిగిందన్నారు. అసెంబ్లీలో గజ్వేల్, సిద్ధిపేట నియోజకవర్గాల గురించి తప్ప దుబ్బాక పేరు ప్రస్తవన లేకుండే. నియోజకవర్గ వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉచిత కోచింగ్ సెంటర్ల ద్వారా భోజన వసతి కల్పించి ఉద్యోగాల కోసం శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామాలలో కొంతమందికి చీరలు పంపిణీ చేసి మరి కొంత మందికి పంపిణీ చేయకపోవడంలో అంతర్యమేమిటన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, బిజెపి రాయపోల్ మండల అధ్యక్షులు మాదాసు వెంకట్ గౌడ్, సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షులు మంకిడి స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు రవీందర్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి రామచంద్రం, మాజీ వైస్ ఎంపీపీ తలారి నర్సింలు,ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులు తూర్పు లక్ష్మణ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు టెంకంపేట నర్సింలు, శక్తికేంద్ర ఇన్చార్జులు వెంకట్ గౌడ్, తిరుపతి రెడ్డి, భూత్ అధ్యక్షులు చంద్రం, కృష్ణ, అశోక్, నాగరాజ్, రాజిరెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, నీల స్వామి ,రాజా గౌడ్, సత్యపాల్ రెడ్డి, మన్నే ఆంజనేయులు, ఉప్పరి రాజు, రాజు, కృష్ణ, హరికృష్ణ గౌడ్, సత్యం, స్వామి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మా ఊరికి రావొద్దు

- ఓట్లప్పుడే గుర్తుకొస్తామా?
- మంచినీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం
- అంగన్వాడి అతీగతి లేదు
- ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు
- ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను అడ్డగించిన మంచినీళ్లబండ గ్రామస్తులు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలంలోని మంచినీళ్లబండ గ్రామం నుంచి ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెడుదామనుకున్న హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌కు ఆదిలోనే పరాభవం ఎదురైంది. ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేసి.. మళ్లీ మా గ్రామానికి ఎలా వస్తారంటూ గ్రామస్తులు ఎమ్మెల్యేను రెండు గంటలపాటు అడ్డుకున్నారు. ఎలాగోలా వారికి నచ్చజెప్పి ఎమ్మెల్యే ప్రచారం మొదలు పెట్టారు. వివరాల్లోకి వెళ్తే.. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మంచినీళ్లబండ గ్రామానికి ఎమ్మెల్యే సతీష్‌కుమార్ వచ్చారు. అయితే ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మా గ్రామానికి ఎందుకు వచ్చారంటూ స్థానికులు ఎమ్మెల్యేను అడ్డుకున్నారు. గ్రామంలో జరిగిన బొడ్రాయి పండుగ సమయంలో లక్ష రూపాయలు ఇస్తానని మోసం చేశాడని వారు ఆరోపించారు. ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీకి ఇప్పటికి నిధులు ఇవ్వలేదని, గ్రామంలో కనీసం ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కనీసం మంచినీళ్ల సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, వానకాలం వస్తే నాచు, పురుగుల నీళ్లు వస్తున్నాయని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. ఇప్పటివరకు అంగన్వాడీ భవనం లేదని, రోడ్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఊరుకు నిధులు కేటాయించామని, పేపర్ల వరకే చెప్పుకుంటున్నారు తప్పా.. అభివృద్ధి చేసింది ఏమీ లేదన్నారు. ఎన్నికలు వస్తేనే తమ ఊరు గుర్తుకు వస్తుందా, లేదంటే ఊరినే మర్చిపోతారా అంటూ ఎమ్మెల్యేను నిలదీశారు. రేషన్ కార్డులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పేదలకు ఇండ్ల నిర్మాణం కూడా చేయలేదన్నారు. పార్టీ కార్యకర్తలకు, ద్వితీయ శ్రేణి నాయకులకు తప్పా.. తమకు ఇచ్చిందేవీ ఎలేదని మండిపడ్డారు. ప్రచార ఆర్భాటాలకి తమ ఊరు పనికొస్తుందా, అభివృద్ధికి పనికిరాదా అంటూ రెండు గంటల పాటు ఎమ్మెల్యేను అడ్డగించారు. చివరికి ఎమ్మెల్యే కలగజే సుకొని, గ్రామస్తులకు నచ్చజెప్పి మళ్లీ ప్రచారం మొదలుపెట్టారు.



నేడు బీఆర్ఎస్ యూత్ సదస్సు

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో నేటి(శుక్రవారం)ఉదయం ఉదయం 9.00 గంటలకు ఎస్ఆర్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మండల స్థాయి యువత, విద్యార్థి, సోషల్ మీడియా సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల యువ జన విభాగం అధ్యక్షుడు అది రామకృష్ణ, భీమ్ రావు, అనీల్‌లు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మెన్ ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత వెంకటేశం గౌడ్, మండలాధ్యక్షుడు రాజేష్ సర్పంచులు, ఎంపీటీసీలు హాజరవుతున్నారన్నారు. మండల బీఆర్ఎస్ శ్రేణులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.



పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ బాధితునికి అప్పగించిన ఎస్ఐ

నవతెలంగాణ-చేర్యాల

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్ స్వాధీనం చేసుకుని గురువారం బాధితునికి పోలీస్ స్టేషన్‌లో చేర్యాల ఎస్ఐ భాస్కర్ రెడ్డి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన గంధమాల రవి తన మొబైల్ ఫోన్‌ను జూన్ 20న పోగొట్టుకున్నాడని ఈ క్రమంలో ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన వెబ్‌సైట్‌లో ఫోన్ యొక్క ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి, బ్లాక్ చేశారు. వెంటనే ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో ఈ వెబ్‌సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం చేర్యాల పోలీసులకు చేరింది. సమాచారం అందుకున్న పోలీసులు ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైతే ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చని తద్వారా ఫోన్‌ను తిరిగి తొందరగా పొందవచ్చని తెలిపారు.

మార్చ్ టు పార్లమెంట్‌ను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

సీపీఎస్ విధానం రద్దు చేయాలని, ఎన్ఈపీ 20-20ను రద్దు చేసి కొత్త పాలసీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 3న ఎస్టీఎఫ్ఐ, ఏఐఎస్ జీఎఫ్, సీసీజీ ఈడబ్ల్యూ, ఏఐఎస్‌జీపీఎఫ్ సంయుక్తంగా నవంబర్ 3న ఢిల్లీలో మార్చ్ టు పార్లమెంట్ నిర్వహిస్తున్నట్టు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.అశోక్, బి. సాయిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా కోర్ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం వల్ల దేశంలోని ఏ ఉద్యోగికి బెనిఫిట్ లేకపోగా తీవ్ర నష్టం వాటిల్లుతున్నదన్నారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి కూడా నష్టమేనన్నారు. ఎంపీఎస్ పేరుతో ఉద్యోగుల మీద రుద్దడం కేవలం కార్పొరేట్ ప్రయోజనాల కోసమేనన్నారు. అసంబద్ధమైన విధానాన్ని రద్దు చేసే వరకు పోరాటం ఆగదన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడానికి, విద్యార్థులను ఏదో ఒక రకంగా పాఠశాలల నుండి దూరం చేయడానికి నూతన విద్యా విధానం 20-20 ని రూపొందించారన్నారు. దేశ భవిష్యత్తుకు ముప్పు గా మారనుందని, దీన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 3న జరగబోయే మాస్టరు పార్లమెంటును ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు శామయ్య, జిల్లా కార్యదర్శిలు బి. సాయితేజ, సింహాచలం, చందర్ రాథోడ్ నాయకులు ఏం. విజయానంద్, శ్యాం ప్రసాద్, కృష్ణమూర్తి, కృష్ణ, అశోక్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దళిత హక్కుల సాధనకు ఛలో ఢిల్లీ

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్



నవతెలంగాణ-సంగారెడ్డి

దళిత హక్కుల సాధన కోసం డిసెంబర్ 4న చేపట్టనున్న ఛలో ఢిల్లీని జయప్రదం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ పిలుపునిచ్చారు. కులవివక్ష వ్యతిరేక పోరాటసంఘం (కేవీపీఎస్) సంగారెడ్డి నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సంగారెడ్డి సుందరయ్య భవన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. దేశంలో దళితులపై రోజు రోజుకు దాడులు తీవ్రం అవుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలే అగ్రకులాలకు కొమ్ము కాస్తు దాడులను ప్రోత్సాహస్తున్నాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా దళిత గిరిజనులను ఏకం చేసి ఐక్యపోరాటాలు నిర్వహించడం కోసం దళిత సామజిక వ్యవసాయ కార్మిక సంఘాలు సిద్ధమాయ్యయన్నారు. దళిత గిరిజనుల సమస్యలపై దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణ, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలనీ, ఎస్సీ ఎస్టీ అట్రా సిటీ చట్టం పటిష్టంగా అమలు చేయాలనీ, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలు చేయాలనీ, దళితులకు 125గజాల ఇం టి స్థలం ఇవ్వాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు జరిపి రాష్టాలు అదనంగా 50 రోజుల పనిదినాలు కల్పించి రోజుకు 600రూపాయల కూలి ఇవ్వాలనే డిమాండ్లతో ఛలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, నాయకులు మల్లేశం, మహేష్, దివాకర్, ప్రభా కర్, సురేష్, పవన్, ఆనంద్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సంగారెడ్డి
శుక్రవారం | 20 అక్టోబర్ 2023 | www.navatelangana.com

ఆటో కొనుగోలు కోసం ఆర్థిక సాయం



నవతెలంగాణ-సంగారెడ్డి

ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించలేని పరిస్థితుల్లో ఉన్నానని.. ఆదుకోవాలని పట్నం మాణిక్యం ఫౌండేషన్‌ను సంగారెడ్డి పట్టణంలో నివసిస్తున్న శివ అనే వ్యక్తి గతంలో సంప్రదించాడు. దీంతో అతనికి ఆటో కొనుగోలుకు ఆర్థిక సాయం చేస్తామని ధైర్యంగా ఉండాలని ఫౌండేషన్ ద్వారా భరోసానిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అతనికి ఆర్థిక సాయాన్ని అందజేశారు. దీంతో శివ ఆటోను కొనుగోలు చేసి గురువారం పట్నం మాణిక్యం ఇంటి వద్దకు తీసుకొచ్చాండు. కాగా పట్నం రవితేజ గుమ్మడికాయ కొట్టి ఆటోకు పూజ చేశారు. అనంతరం శివ కుటుంబ సభ్యులు పట్నం మాణిక్యం ఫౌండేషన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వర్ధన్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలో రూ.27.30 లక్షలు పట్టివేత



నవతెలంగాణ-జహీరాబాద్

వాహన తనిఖీల్లో భాగంగా గురువారం జహీరాబాద్ పోలీసులకు భారీగా నగదు పట్టుబడింది. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.27.30 లక్షలను పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఓ వ్యానులో రూ.27.30 లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. నగదుకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. నగదు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేశారు. ఈ నగదును జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జమ చేయనున్నట్టు పోలీసులు తెలిపారు.



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-పటాన్‌చెరు

శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ మహంకాళి దేవాలయం, నందిగామ గ్రామంలో ఏర్పాటు చేసిన దేవీ మండపాలను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సపాన దేవ్ తదితరులు పాల్గొన్నారు.



ఆకుకూరలపై డీడీఎస్ మహిళల అవగాహన

నవతెలంగాణ-ఝరాసంగం

మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామంలో గురువారం డీడీఎస్ (డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ) ఆధ్వర్యంలో మహిళా సంఘాలు ఆకుకూరల వినియోగంపై అవగాహన కల్పించారు. గ్రామంలో లభించే చెట్లు ఆరోగ్యానికి ఏ విధంగా ఉపయోగపడతాయో గ్రామ సంఘం మహిళలకు ఆరోగ్యం కో-ఆర్డినేటర్ పూలమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, నాగమ్మ, పారమ్మ, కమలమ్మ, చిన్న నర్సమ్మ, మొగులమ్మ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-గుమ్మడిదల

రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట నరసింగారావు అన్నారు. మండలంలోని బొంతపల్లి, వీరారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో గురువారం ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా నరసింగారావు మాట్లాడుతూ.. గుమ్మడిదల మండలంలో కుల సంఘాల పేర్లతో ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం మరోసారి వంచించే ప్రయత్నం చేస్తున్నదన్నారు. కేసీఆర్‌తో పాటు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి గారడి మాటలను మండల ప్రజలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మండల సమస్యలు పరిష్కారం కావాలంటే కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాటా శ్రీనివాస్ గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు నాగేందర్ గౌడ్, గోవర్ధన్ గౌడ్ మాజీ మండలాధ్యక్షుడు మద్ది వీరారెడ్డి బాలకృష్ణ గౌడ్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఎంపీ ఖేడ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకాష్ రాథోడ్



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ బీఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకాష్ రాథోడ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 12 ఏండ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల కోసం తాను చేస్తున్న పోరాటాలను గుర్తించి.. పార్టీ టికెట్ ఇచ్చిందన్నారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏ పార్టీ కూడా యువ కులకు అవకాశం ఇవ్వలేదని.. చిన్న వయసులోని తనకు రెండుసార్లు టికెట్ కేటాయించారన్నారు. తాను ఎమ్మెల్యే గెలిస్తే.. 21 ఏండ్లు దాటిన ప్రతి యువతకు ఉద్యోగం లేదా ఉపాధి కల్పించడానికి కృషి చేస్తాన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి. రాజకీయ, న్యాయ రక్షణ, వ్యాపార, పారిశ్రామిక మొదలగు రంగాల్లో ఓసీ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ మత మైనారిటీ వర్గాల వారికి వారి వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్స్ కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల వారి లాగా ఓబీ సీ వర్గానికి కూడా పదోన్నతులలో రిజర్వేషన్స్ కల్పించడానికి కృషి చేస్తామన్నారు.



క్రాంతి కిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

నవతెలంగాణ-మునిపల్లి

'బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేద్దాం.. చంటి క్రాంతి కిరణ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుం దాం' అంటూ మండలంలోని బుసారెడ్డిపల్లి గ్రామంలో ప్రతిజ్ఞ చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి మంతూరి శశి కుమార్ ఆధ్వర్యం లో గురువారం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌కు మరోమారు బీ-ఫామ్ రావడం సంతోషకరమన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోకుండా.. మరోసారి చంటి క్రాంతి కిరణ్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు.

ఎన్నికల విధులపై పూర్తి అవగాహన ఉండాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఎన్నికల విధులు పూర్తి అవగాహనతో నిర్వర్తించినప్పుడే ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. మాట్లాడుతూ మాస్టర్ ట్రైనర్లు ప్రతీ అంశంపై తరోగా అవగాహన చేసుకోవాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చేప్పుడు వారి సందేహాలను నివృత్తి చేయాలని, అందుకు ముందుగా తాము(ఏ ఎల్ ఎం టి లు) తీసుకుంటున్న శిక్షణలోని ప్రతీ అంశంపై పట్టు ఉండాలన్నారు. ఎన్నికల సిబ్బంది ఎంత అవగాహనతో పని చేస్తే ఎన్నికలు అంత బాగా జరుగుతాయన్నారు. ప్రిసైడింగ్,అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సరైన శిక్షణ ఇవ్వకపోతే తప్పులు జరిగే అవకాశం ఉంటుందన్నారు. మాక్ పోల్ నిర్వహణ, ఈవీఎం ఆపరేట్ చేయడం, ప్రిసైడింగ్ అధికారుల విధులు, బాధ్యతలను, ప్రీ పోల్, పోలింగ్ తర్వాత చేయాల్సిన పనులు విడమర్చి చెప్పాలని, నిబంధనలను వివరించాలని సూచించారు. అదే విధంగా ఎన్నికల నిర్వహణ కు సంబంధించి ప్రతి అంశంపై ప్రిసైడింగ్ అధికారులు చేయవలసినవి, చేయకూడనివి స్పష్టంగా వివరించాలన్నారు. రిటర్నింగ్ అధికారి స్థాయిలో కూడా శిక్షణ ఇవ్వాలని ఆర్‌ఓలకు సూచించారు. ఎన్నికల సిబ్బంది శిక్షణలకు సంబంధించిన షెడ్యూల్ సిద్ధం చేయాలని రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ నగేష్, మాస్టర్ ట్రైనర్ క్రిష్ణ కుమార్, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్ రెడ్డి,ఐదు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సీజ్ చేసిన నగదు విడుదలకు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీలో నోడల్ అధికారిగా డీసీఓ తుమ్మ ప్రసాద్, సభ్యులుగా డీటీఓ కవిత, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు ను నియమించినట్టు చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50 వేల మించి ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న/ రవాణా చేస్తున్న నగదు సీజ్ చేస్తున్నారన్నారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించి సదరు వ్యక్తులు పూర్తి ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పిస్తే.. కమిటీ పరిశీలించి సరి అయిన ఆధారాలు ఉంటే సీజ్ చేసిన నగదును విడుదల చేస్తుందన్నారు. నగదు సీజ్‌కు గురైన వారు పూర్తి ఆధారాలతో జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సంప్రదించాలని సూచించారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ అధికారులను 9100115691/9281487272/ 7799934135 ద్వారా సంప్రదించాలన్నారు.



ట్రైబల్ నియోజకవర్గ ఇన్చార్జిగా శంకర్ నాయక్

నవతెలంగాణ-జహీరాబాద్

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ట్రైబల్ నియోజకర్గ ఇంఛార్జిగా శంకర్ నాయక్ ను నియమించి,నియామక ఉత్తర్వులను ఎమ్మెల్యే మాణిక్ రావు అందించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నియోజకవర్గ మైనారిటీ ఇన్చార్జిగా మహమ్మద్ సభ్యులుగా ఫారూఖ్, యూసుఫ్, మౌలానా, ఫక్రుద్దీన్, ఖదీర్‌లను నియమించారు .టీఎస్ ఐడీసీ చైర్మెన్ మొహమ్మద్ తన్వీర్, ఎలక్షన్ ఇంచార్జీ దేవీప్రసాద్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ మచ్చెందర్, ఎంపీటీసీ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం



నవతెలంగాణ-పటాన్‌చెరు

సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందేందుకు, ఆరోగ్యకరమైన జీవనానికి స్వచ్ఛమైన యోగా జీవితం గడపడం మంచిదని రూ ఎడ్యుకేషన్ చైర్మెన్ రమేష్ పక్తాని అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో 'యోగా ద్వారా మానసిక ఆరోగ్యం' (మెంటల్ వెల్నెస్ - యోగిక్ వే) అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఆరోగ్యాన్ని సాధించడానికి ఒకరి ఉద్దేశం, చర్యలు, భావోద్వేగాలు, ఆలోచనలను శుద్ధి చేయడం యొక్క ప్రాముఖ్యతనువివరించారు. మానవ శరీరం ఇంజనీరింగ్ గురించి చెబుతూ, ఇది 140 సంవత్సరాల సౌకర్యవంతమైన జీవితకాలం కోసం నిర్మితమైందని, అయినప్పటికీ సగటు వయస్సు 70 ఏళ్లు మాత్రమేనన్నారు. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పేలవమైన నీటి నాణ్యత, కలుషితమైన గాలి, నిశ్చల జీవన శైలి ద్వారా శరీరాన్ని దుర్వినియోగం చేయడం వల్ల క్రమంగా అది శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. ఎప్పుడు మాట్లాడాలో, మరెప్పుడు మౌనంగా ఉండాలో తెలుసుకుని వ్యవహరించాలని విద్యార్థులకు హితవు పలికారు. నిశ్శబ్దం శక్తిని ప్రస్తావిస్తూ, ఇతరులను సానుకూలంగా ప్రభావితం చేయడానికి ప్రసంగాన్ని ఒక వనరుగా ఉపయోగించడం యొక్క ప్రాముఖ్యతను రమేష్ నొక్కిచెప్పారు. ఆరోగ్యానికి సంబంధించిన మూడో అంశం, భావోద్వేగాల శుద్ధీకరణ అని, దీనిని 'భావ శుద్ధి' అని కూడా అంటారని, భావోద్వేగాలు చర్యలను ఎలా ప్రభావితం చేస్తాయో ఆయన వివరిం చారు. కోపాన్ని నియంత్రించుకోవడం, క్షమాపణను స్వీకరించడం అవశ్యమని, విధ్వంసక ప్రవర్తనకు దారితీసే అనియంత్రిత భావోద్వేగాలకు లోనుకాకూడదని హెచ్చరించారు. అదే సమయంలో సానుకూల మనస్తత్వాన్ని కొనసాగించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. సమస్యలను సానుకూలంగా మలచుకుని, వై ఫల్యాల నుంచి నేర్చుకోవాలని, అవకాశాలపై దృష్టి పెట్టాలని, వివిధ ప్రతికూల పరిస్థితులలో కూడా సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని రమేష్ పక్తాని సూచించారు.ఆరోగ్యం, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన విలువైన అంతర్దృష్టులను అందించిన రమేష్ ను కార్యక్రమ సమన్వ యకర్త డాక్టర్ దుర్గేష్ నందనీ కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేగా ఆదరించండి.. ప్రజా సమస్యలు పరిష్కరిస్తా

- రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్
- కొనసాగుతున్న పాదయాత్ర



నవతెలంగాణ-గుమ్మడిదల

పటాన్చెరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆదరించి అవకాశం కల్పిస్తే.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తానని రాష్ట్ర నాయకులు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఇటీవలే చేపట్టిన పాదయాత్రలో భాగంగా మండల పరిధిలోని బొంతపల్లి, వీరన్నగూడెంతో పాటు పలు గ్రామాల్లో నీలం మధు ముదిరాజ్ గురువారం పర్యటించారు. ప్రజా సమస్యలను తెల్సుకుంటూ.. ఒక్కసారి తనను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారు. రాష్ట్రంలోనే పటాన్చెరువు నియోజకవర్గంలో అభివృద్ధి ఒకవైపు, సంక్షేమాన్ని మరొక వైపు పరుగులు పెట్టిస్తానంటున్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలబెడతానంటూ మహిళలకు వాగ్దానం చేస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే అవినీతి పాలనను అంతమొందించాలంటే అధికారం అవసరమని.. అందుకే ఎమ్మెల్యేగా నిలబడ్డట్టు తెలిపారు. అనంతరం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొని.. దుర్గా మాత పూజా భజన భక్తులతో పాటు అమ్మవారి నామస్మరణ సంగీతాలను తిలకించారు. కార్యక్రమంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని తాగుబోతు తెలంగాణగా మార్చిన కేసీఆర్

- మాజీ మంత్రి, డాక్టర్. చంద్రశేఖర్



నవతెలంగాణ-ఝరాసంగం

9 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 3 వేల పాఠశాలలు మూసివేసి.. గ్రామాల్లో 18 వేల బెల్టు షాపులను తెరిపించి రాష్ట్రాన్ని తాగుబోతు తెలంగాణగా మార్చారని మాజీమంత్రి, జహీరాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్. ఏ చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని కంబాలపల్లి, నర్సాపూర్, గుంతమర్పల్లి, కొల్లూర్, కప్పాడ్, తుమ్మన్‌పల్లి, సంగం (కె) గ్రామాల్లో 'వస్తున్న మీకోసం' కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 12 వేల మంది ఆత్మబలిదానం చేస్తే తెలంగాణలో ఆత్మబలిదానాలు జరగకూడదని సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ప్రకటించిందన్నారు. నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగు నీరు అందిస్తామని, దళితులకు మూడెకరాల భూమిని పంపిణీ చేస్తామని ఈ రాష్ట్ర ప్రజలను కేసీఆర్ మోసం చేశారన్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 6 గ్యారంటీల స్కీంను తూచా తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హనుమంత్ రావు పాటిల్, ఎంపీపీ దేవదాస్, నాయకులు ముల్తానీ,మోహన్ రెడ్డి,నవాజ్ రెడ్డి, ఉదయ్ శంకర్ పాటిల్, అన్సార్, మటూరి రాజు, ప్రకాష్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోండి

- నందీశ్వర్ గౌడ్‌పై మున్సిపల్ చైర్మెన్ ఫైర్..



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ శ్రీ బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయ భూములకు సంబంధించి నిరాధార ఆరోపణలు చేయడం మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ స్థాయికి తగదని, గజం భూమి కబ్జా చేసినట్టు నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి ఘాటుగా హెచ్చరించారు. గురువారం ఉదయం బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రసిద్ధ సేవ క్షేత్రంగా విరాజుల్లుతున్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయాన్ని సీఎం కేసీఆర్, స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డిల సహాయ సహకారాలతో అభివృద్ధి పథంలో తీసుకుని వెళుతున్నామని, దేవాలయానికి సంబంధించిన భూములు అన్నింటిని సర్వే చేయించి ప్రహరీ గోడ నిర్మిస్తున్నామన్నారు. దీంతోపాటు అన్ని కుల సంఘాల విజ్ఞప్తి మేరకు గుట్టపైన స్థలాలు కేటాయించి ఫంక్షన్ హాల్లు నిర్మించే గురుతర బాధ్యత ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు వస్తున్నాయని ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ నిరాధార ఆరోపణలు చేస్తూ చిల్లర రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటు అన్నారు. దేవుడు భూములపై రాజకీయాలు చేయడం ఎవరికి సరికాదన్నారు. ప్రజల అభిమానాన్ని పొందాలంటే ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. భవిష్యత్తులోనూ ఇదే వైఖరిని కొనసాగిస్తే ప్రజలు తరిమి తరిమి కొడతారని హెచ్చరించారు.ఈ సమావేశంలో స్థానిక కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాషాయీకరణ, కార్పొరేట్‌కి వ్యతిరేకంగా పోరాడాలి



నవతెలంగాణ-జహీరాబాద్

కాషాయికరణ, కార్పొరేటర్స్‌కి వ్యతిరేకంగా పీడీఎస్‌యూ పోరాటాలు నిర్వహించాలని టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు కొండల్ రెడ్డి అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) డివిజన్ రాజకీయ శిక్షణ తరగతులను ఆశ్చర్య డిగ్రీ కళాశాలలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో త్యాగాలతో, పోరాటాలతో హైదరాబాద్ నడిబొడ్డున ఉస్మానియా యూనివర్సిటీలో జార్జిరెడ్డి నేతృత్వంలో ఆవిష్కరించబడ్డ పీడీఎస్‌యూ కాషాయీకరణకు, కార్పొరేట్లకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. 'జీనా ఐతో మర్‌నా సీకో.. కదం కదం ఫర్ లగ్నా సీకో' అనే జార్జి నినాదంతో జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పైన అనునిత్యం పోరాటం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యారంగాన్ని మొత్తం నిర్వీర్యం చేస్తూ అశాస్త్రీయ భావాలను, మూఢ నమ్మకాలను పెంపొందించే నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చిందన్నారు. విద్యా ప్రైవేటీకరణ, కాషాయీ కరణ వైపు నెట్టివేస్తూ పేదలకు విద్యను దూరం చేసే విధంగా కుట్ర చెస్తోందన్నారు. ప్రభుత్వం విద్యాలయాల కు అధిక నిధులు కేటాయించాకుండా నిర్లక్ష్యం చేస్తూ, సమస్యల వలయంలో కి నెట్టివేస్తుందన్నారు. తమ ఆధిపత్య భావజాలాన్ని (మనువాదాన్ని) అమలు చేసే వ్యవస్థల అశాస్త్రీయ భావజాలన్నీ వ్యతిరేకంగా ప్రగతిశీల శక్తులు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సురేష్, నరసింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సందీప్, జిల్లా నాయకులు, డివిజన్ అర్జున్ నాయకులు ఏలియా, కోటేశ్వరరావు, పౌల్‌రాజు, భాస్కర్, సంకేత్ రోహిత్ దినేష్, కృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులను గుర్తించిన పార్టీలకే మద్దతు



నవతెలంగాణ-జోగిపేట

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజులను గుర్తించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ పొలిట్ బ్యూరో సభ్యుడు బి.నారాయణ ముదిరాజ్ స్పష్టం చేశారు. అందోల్ నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి పుల్కల్ మండల ముదిరాజ్ మహాసభ ప్రతినిధుల సమావేశాన్ని గ్రామ శాఖ అధ్యక్షులు సుజనయ్య అధ్యక్షతన కోర్పోలు గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. ముదిరాజులను గుర్తించిన పార్టీలకే ఈసారి మద్దతు ఉంటుందని ఏకగ్రీవంగా తీర్మానించినట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకులతో కొట్లాడి ముదిరాజులు ప్రాణాలను బలిదానాలు చేసి తెలంగాణను సాధించుకున్నారన్నారు. వెనుకబడిన తరగతుల జనాభాలో అధిక సంఖ్యలో కలిగిన ముదిరాజులు అణచివేతకు గురవుతున్నారన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఉద్యోగపరంగా వారికి సౌకర్యాలు కల్పించడంలో విస్మరిస్తున్నారన్నారు. ముదిరాజులను బిసి-డి నుంచి ఏ లకు మార్చాలని, మత్స్యకారులకు ప్రత్యేకంగా ఇల్లు నిర్మించి ఇవ్వాలని, పెన్షన్లు, నాణ్యమైన చేప పిల్లల పంపిణీ వంటి సౌకర్యాలు కల్పించాలని.. ఇవ్వని చేసిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని సమావేశంలో తీర్మానించినట్టు చెప్పారు. ముదిరాజుల ఐక్యతను తెలియజేసేందుకు ర్యాలీలు, మండల స్థాయి సమావేశాలు నిర్వహించాలని తీర్మానించామన్నారు. ఈ ప్రతినిధుల సమా వేశంలో సుమారుగా 100 మంది పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ ముకుందం, మత్స్య సహకార సంఘం డైరెక్టర్ రాజు, సభ్యులు శివచందర్, నర్సింలు, లక్ష్మీ నారాయణ, రవీందర్, మల్లేశం, నాగరాజు, రాజేష్, పోచారం, యువత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బొంతపల్లిలో జానపద భజన పోటీలు



నవతెలంగాణ-గుమ్మడిదల

జానపద కలలను వెలికి తీసే కార్యక్రమాల్లో భాగంగా గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి గ్రామంలో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం భజన కీర్తనల పోటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మారుతి, భజన మండలి సభ్యులు మాట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో జానపద కలలకు ఆదరణ కల్పించాలనే ఉద్దేశంతో ఈ భజన పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ పోటీల్లో ఆరు బృందాలు పాల్గొనగా.. చిలిపిచెడ్ మండలానికి చెందిన అశ్వినిరెడ్డి బృందానికి మొదటి బహుమతి వచ్చిందన్నారు. అలాగే వట్టిపల్లి మండలానికి చెందిన భజన బృందానికి రెండో బహుమతి, విజయలక్ష్మి భజన మండలి, మహిళా భజన కళాకారులకు తృతీయ బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ కుమార్ గౌడ్, సర్పంచ్ ఆలేటి నవీన శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ సంజీవరెడ్డి, ఎంపీటీసీ సురభి నాగేందర్ గౌడ్, ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకులు నీలం మధు ముదిరాజ్, నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, న్యాయ నిర్ణయతలుగా జల్లిపల్లి బ్రహ్మం, వడ్డే ముద్దంగుల ఎల్లన్న నిర్వాహకులు లచ్చన్న మారుతి భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.20 లక్షల విలువచేసే టేకు దుంగలు పట్టివేత



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

పాపన్నపేట మండల పరిధిలోని ఆబులాపూర్ గ్రామంలో చాకలి నరసయ్య తన పొలం వద్ద అనుమతి లేకుండా దాదాపు రూ.1.20 లక్షలు విలువచేసి 20 టేకు దుంగలను గురువారం సాయంత్రం పట్టుకున్నట్లు డిప్యూటీ రేంజ్ అటవీ శాఖ అధికారి శ్రీనివాస్ నాయక్ తెలిపారు.. చాకలి నరసయ్య తన పొలం వద్ద అనుమతి లేకుండా 20 టేకు దుంగలు నరికి తన ఇంటికి తరలిస్తున్న క్రమంలో గ్రామస్తులు సమాచారం అందించడంతో అటవి శాఖ సిబ్బంది వెంటనే స్పందించి 20 టేకు దుంగలను స్వాధీనం చేసుకుని పెద్దశంకరంపేటలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు ప్రవీణ్, రమేష్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలో రూ.74 లక్షల పట్టివేత

- సీఐ షేక్ లాల్ మదర్



నవతెలంగాణ-నర్సాపూర్

ఎన్నికల కోడ్ అమలులో భాగంగా వాహనాల తనిఖీ చేస్తుండగా రూ.74 లక్షలను పట్టుకొని సీజ్ చేశామని సీఐ షేక్ లాల్ మదర్ తెలిపారు. గురువారం ఆయన నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. నర్సాపూర్ పట్టణ సమీపంలోని హైదరాబాద్ వెళ్లే మార్గంలో ఉన్న మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న సీఎంసి కంపెనీకి చెందిన ఏటీఎంలలో డబ్బులు జమ చేసే టాటా యోధ వాహనాన్ని తనిఖీ చేశామన్నారు. అయితే ఆ వాహనంలో రూ.74 లక్షలు పట్టుబడ్డాయన్నారు. ఆ డబ్బులకు ఎటువంటి ఆధారాలు లేనందున సీజ్ చేయడం జరిగిందన్నారు. ఈ తనిఖీలో నర్సాపూర్ ఎస్సై శివకుమార్, చిలపిచెడ్ ఎస్సై మహబూబ్, ఏఎస్ఐ స్వరూప సిబ్బంది ఉన్నారు.

పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణది

- జిల్లా ఎన్నిక అధికారి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-మెదక్

పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణలో ఉందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. గురువారం మెదక్ సమీకృత కలెక్టర్ కార్యాలయంలో స్వీప్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. కలెక్టర్, ఎస్పి ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమంలో బీఎల్ఓల పాత్ర మరువలేనిదని కొనియాడరు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఎలాంటి భయానికి లోను కాకుండా ఓటు వేయాలన్నారు. స్వీప్ అధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించి గెలిచిన మహిళలకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, రమేష్, డీఆర్ఓ పద్మశ్రీ, సీడీపీఓ స్వరూప, ఏసీడీపీఓ వెంకటరమణ, అంగన్వాడి టీచర్స్, ఆయాలు, ఆశ కార్యకర్తలు, ఎన్నికల సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో హనుమాన్ ఆలయంలో శ్రీ దుర్గామాత ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో 19వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం వేదపండితులు వేలేటి లక్ష్మణ శాస్త్రి, విశ్వేశ్వర శర్మ అనుపు శర్మ ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో ఘనంగా మహాచండి హెూమం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి హెూమంలో పాల్గొన్నారు. దుర్గాదేవి సరస్వతీ మాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలు ఉత్సవ కమిటీ సభ్యులు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గంగాధర్ గౌడ్, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు సిద్ధరాంరెడ్డి, చంద్రకాంత్ గౌడ్, బట్ట మహేష్, జీపీ స్వామి, శ్రీనివాస్, కరుణాకర్, వెల్దుర్తి శ్రీకాంత్‌గౌడ్, శివకుమార్, నాయిని మల్లేశం, పున్న వెంకటస్వామి, తిరుపతి, వీరమల్లు లింగం, చంద్రం, నాగరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో రైతు మృతి





నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన గజ్జల యాదవరెడ్డి (45) తన పొలంలో గల వ్యవసాయ బోరు మోటారు రిపేర్ నిమిత్తం పొలంలోకి తన గ్రామస్తులతో కలిసి తన పొలంలో స్టార్టర్ డబ్బా వద్ద రిపేరు చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు తీగ తగిలి అతను కిందపడిపోయాడు. విషయం గమనించిన తోటి వారు నంద్యాల భాస్కర్ రెడ్డి, ఇతరులు కలిసి చికిత్స నిమిత్తం యాదారెడ్డిని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు పరీక్షించి అప్పటికే యాదవరెడ్డి మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుని భార్య గజ్జల మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఇంటింటి ప్రచారం

- గాలి అనిల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక





నవతెలంగాణ-వెల్దుర్తి

ప్రచారం కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండలాల్లో కాంగ్రెస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం మాసాయిపేట మండలం రామంతపూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న దర్గా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం లింగారెడ్డి పల్లె గ్రామంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ఆరు పథకాల గురించి ఇంటింట ప్రచారం నిర్వహించారు. వెల్దుర్తి మండల పరిధిలో ఉప్పు లింగాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేష్ రెడ్డి ఇంటి పరిసరాల్లో ఏర్పాటు చేసిన వేదికపై నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ఆరు పథకాల గురించి తెలియపరిచారు. నర్సాపూర్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో అచ్చంపేట గ్రామానికి చెందిన కొంతమంది గాలి అనిల్ కుమార్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన మోసాలకు విసిగిపోయిన ప్రజానీకం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు.

కల్వర్టులను పరిశీలించిన ఇంజనీర్

- నార్లాపూర్ నుంచి ఫుల్ మామిడి వరకు డబుల్ రోడ్డు



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామం నుంచి ఫుల్‌మామిడి గ్రామం వరకు డబుల్ రోడ్డు మంజూరైనట్లు పనులు కూడా త్వరగా పూర్తి చేస్తామని ఆర్ అండ్ బీ అధికారులు తెలిపారు. ఈ రోడ్డుకు రూ.1.50 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం సింగిల్ బీటీ రోడ్డు ఉన్నందున ఈ రోడ్డు వెంట వాహనాలు అధికంగా తిరగడంతో డబుల్ రోడ్డు మంజూరైనట్లు తెలిపారు. కల్వర్టును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. డబుల్ రోడ్డు మారడంతో వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు.

రియల్ మాఫియా ఏజెంట్ మున్సిపల్ సర్వేయర్

- పేదల గుడిసెలు కూల్చడం దారుణం
- బతుకమ్మ ఆడి నిరసన తెలిపిన బాధిత మహిళలు





నవతెలంగాణ-మెదక్

మెదక్ మున్సిపల్ సర్వేయర్ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం మహిళా సంఘం జిల్లా కన్వీనర్లు కె. గీత, బి నాగమణి పేర్కొన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని హమాలి కాలనీ, భగత్ సింగ్ నగర్‌లో ఈ నెల 9వ తేదీన పేదల గుడిసెలపై దాడి చేసి కూల్చేసిన ప్రాంతం వద్ద బాధిత మహిళలు బతుకమ్మ ఆట పాటలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దల అండదండలతో మున్సిపల్ అధికారులు పేదల గుడిసెలు కూల్చడం దారుణన్నారు. మున్సిపల్ సర్వేయర్, కమిషనర్‌లు రియల్ వ్యాపారులకు ఏజెంట్లుగా మారారని ఆరోపించారు. మెదక్ జిల్లా కేంద్రంలో అడ్డు అదుపు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను, అసైన్డ్ భూములను కబ్జాలు చేస్తూ వెంచర్‌లు వేస్తున్నట్లు తెలిపారు. రోడ్లు, పార్కులను కబ్జాలు చేస్తున్నా పట్టించుకోని మున్సిపల్ అధికారులు హమాలి కాలనీలో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలపై దౌర్జన్యాలకు పాల్పడి గుడిసెలు కూల్చారన్నారు. 1992లో, 2006లో పట్టాలు ఇచ్చినప్పటికీ నాటి ప్రభుత్వాలు పొజిషన్ చూపకుండా కాలయాపన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 1992లో హమాలి కార్మికులకు, పేదలకు 5 ఎకరాల 31 అసైన్మెంట్ కమిటీ ద్వారా ఇచ్చారన్నారు. అందులో 114 మందికి రెండు దఫాలుగా పట్టాలు ఇచ్చి పొజిషన్ చూపించలేదన్నారు. గత పది నెలల నుంచి పట్టాలు ఉన్న పేదలు కబ్జాలకు వచ్చి గుడిసెలు వేసుకొని నివాసం ఉన్నారని, పోలీసుల అండతో నోటీసులు ఇవ్వకుండా దాడి చేయడం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఏజెంట్లుగా వ్యవహరించడం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మున్సిపల్ లేఔట్ ప్రకారం పేదలకు పొజిషన్ చూపించి పట్టాలు ఉన్న వారికి ఇల్లు కట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలన్నారు. పట్టాలు లేని వారికి 58 జీవో ప్రకారం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టాలు ఇచ్చే వరకు ప్రాణాలు పోయినా భూమిని వదిలేది లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు రామవ్వ, కమల, యాదమ్మ, అంజమ్మ, రాజమణి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- డబ్బు సంచులను ఆశ చూపించి కాంగ్రెస్ నేతలను కొనుగోలు చేస్తున్నారు
- ఎన్నికల్లో డిపాజిట్ గల్లంతు కావడం ఖాయం
- కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ రావు



నవతెలంగాణ-మెదక్

బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మతిస్థిమితం కోల్పోయి పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని మైనంపల్లి సోషల్ సర్వీస్ ఛైర్మెన్, మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ రావు విమర్శించారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రోహిత్ మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గం ప్రజలు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పదవకు అవకాశం ఇస్తే ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలపైన లేని చిత్తశుద్ధి కాంగ్రెస్ కార్యకర్తలపై ఎందుకు ఉందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులకు డబ్బు సంచులను ఆశగా చూపించి కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వైఖరి మార్చుకుంటేనే కనీసం డిపాజిట్ వస్తదని, లేకుంటే డిపాజిట్ గల్లంతయ్యే విధంగా ప్రజలు బుద్ధి చెపుతారన్నారు. తమకు ఎలాంటి రాజకీయ పదవులు లేకున్నా, సోషల్ సర్వీస్ ద్వారా సేవా కార్యక్రమాలు చేశామని తెలిపారు. మాటలు చెప్పే నాయకులం కాదని చేతల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. తనకు జ్వరం వస్తె కూడా దాన్ని బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేసుకున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్‌కు జ్వరం వస్తె ఇంట్లో ఉండకుండా బయట తిరుగుతాడా అని ప్రశ్నించారు. మెదక్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

లావణ్యరెడ్డికి ఎదురుదెబ్బ

మెదక్ షాడో ఎమ్మెల్యేగా వ్యవహరించిన జెడ్పీ వైస్ ఛైర్మన్ లావణ్య రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. స్వగ్రామమైన బాలానగర్ ఉపసర్పంచ్ పద్మ శివ రాథోడ్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ విషయంలో రాజ్ పల్లి మాజీ సర్పంచ్ నాగరాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్ రెడ్డి కీలకంగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండన్ సురేందర్ గౌడ్, బొజ్జ పవన్, జీవన్, తాహేర్, నాగరాజు శివ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఓటింగ్ లక్ష్యంగా కృషి చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా





నవతెలంగాణ-మెదక్

వందశాతం ఓటింగ్ లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా కోరారు. గురువారం మెదక్ మండలం రాజ్‌పల్లి, మెదక్ పట్టణం దాయార వీధిలో ఓటరు నమోదుపై జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శినితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగంపై అధికారులు ప్రజలను చైతన్యవంతులుగా తయారు చేయాలన్నారు. ఓటు హక్కు స్వేచగా ఉపయోగించాలన్నారు. ప్రలోభాలకు లోనుకాకూడదని, ఓటు బ్రహ్మాస్త్రం అని, దేశాన్ని ప్రభావితం చేసే శక్తి అని తెలిపారు. దేశంలో ఉన్న ప్రజలందరికీ ఓటు విలువ సమానంగా ఉంటాదన్నారు. ఓటు దుర్వినియోగం చేయకూడదని, ఎవరైనా ఓటు నమోదు చేసుకోకపోతే, ఈ నెల 31 వరకు అవకాశం ఉందన్నారు. ఓటింగ్‌లో గతంలో 3వ స్థానంలో ఉన్న జిల్లా మొదటి స్థానంలో ఉంచాలన్నారు. స్వీప్ ఓటరు చైతన్య రథం ప్రచారం చేస్తుందని, నవంబర్ 10 నుంచి 25 వరకు ఓటరు గుర్తింపు స్లిప్పు అందజేస్తామని తెలిపారు. పోలింగ్ స్టేషన్ దగ్గర ఓటరు అసిస్టెంట్ బూత్‌ను ఏర్పాటు చేస్తామని, ఓటరుకు ఏమైనా సందేహం ఉంటే ఓటరు అసిస్టెంట్ బూత్‌లో చెక్ చేసుకోవచ్చున్నారు. ఓటింగ్ రహస్య పద్ధతిలో జరుగుతుందని తెలియజేశారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఓటరు చైతన్యరథం ద్వారా ప్రచారం చేస్తుందన్నారు. వంద శాతం ఓటింగ్ లక్ష్యంగా ప్రచారం చేస్తుందని తెలిపారు. 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో ప్రజలు అందరూ ఓటింగ్‌లో భాగస్వామ్యం కావాలని కోరారు. కళాకారులు ఆట పాటలతో ప్రజలకు చైతన్యం కల్గించాలని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ ఏదైనా పిర్యాదులు ఉంటే సి విజిల్ ఆప్‌లో ఫిర్యాదు చేయవచ్చని, కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1950కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. డబ్బు, మద్యం, ఏదైనా వస్తువుల పంపిణీ జరిగిన నేరుగా పిర్యాదు చేయవచ్చున్నారు. పిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ మెప్మా ఇందిర, ఆర్డిఓ అంబదాస్ రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, తెలంగాణ సంస్కృతిక శాఖ కళాకారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రఘునందన్ రావు అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి

- జెడ్పీటీసీ కృష్ణా రెడ్డిలి



నవతెలంగాణ-నార్సింగి

ఎమ్మెల్యే రఘునందన్ నిజాలు మాట్లాడాలని, కల్లబొల్లి మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని జెడ్పీటీసీ కృష్ణా రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జెడ్పీటీసీ కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ తన స్థాయికి తగ్గట్టుగా మాట్లాడడం లేదన్నారు. ఎమ్మెల్యే కాక మునుపు స్వర్గీయ ఎమ్మెల్యే రామ లింగా రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి పనులను కూడా తానే చేయించానని అబద్ధపు మాటలతో ప్రజలను తప్పు దోవ పట్టించడం సరి కాదన్నారు. శాలిపెట్ రోడ్డులో మోరం వేయించానని, కల్వర్టులు నిర్మాణం చేయించానని అంటున్న ఎమ్మెల్యే, ఉపాధి హామీ పథకం క్రింద వచ్చిన లక్షా అరవై వేల నిధులను తీసుకుని, రెండు లక్షలు తన స్వంత నిధులు పెట్టానని అంటున్న విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్ జాతీయ రహదారిపై నిర్మాణం జరిగిన బ్రిడ్జి, మెదక్ నియోజకవర్గంలోని జప్తీ శివనూర్ వద్ద నిర్మాణ దశలో ఉన్న బ్రిడ్జి తన పరిధి కాకున్నా తానే నిర్మాణం చేశానని అనడం ఆయన అబద్ధపు మాటలకు నిదర్శనమన్నారు. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు మాట్లాడుతూ పద్మ రాయన్ గుట్ట నుంచి నార్సింగి వరకు నిర్మించిన రోడ్డు నిర్మాణం పూర్తి అయిన భాగం మెదక్ నియోజకవర్గంలోనిది కూడా తానే వేయించానని, గన్నేరు వాగు నుంచి నార్సింగి వరకు నిలిచిన భాగం దుబ్బాక నియోజకవర్గం పరిధి లోనిది కాదా అని, దాన్ని ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. మండల పరిధిలో జరిగిన అభివృద్ధి అన్ని పనులకు కూడా ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి విన్నవించి ప్రొసీడింగ్స్‌ను తెచ్చుకుని చేయించుకున్నవన్నారు. ఎమ్మెల్యే దగ్గరకి ఒక్క సారి కూడా వెళ్లి అడగలేదని, కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన అభివృద్ధిని తన ఖాతాలో వేసుకోవడం ఆయన స్థాయికి తగదని వివిధ గ్రామాల సర్పంచ్‌లు మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలారం బాబు, ఉప సర్పంచ్ యోగి, పెద్ద తాండ సర్పంచ్ చత్రియ నాయక్, ఎంపీటీసీ సత్యనారాయణ, సీనియర్ నాయకులు శ్రీపతిరావు, ఆకుల మల్లేష్ గౌడ్, సత్యం, బీఆర్ఎస్ తాండ అధ్యక్షుడు భాషా నాయక్, వార్డ్ మెంబర్ జీవన్, శ్రీకాంత్,ఎంకే నారాయణ, రబ్బాని, మన్నే యాదగిరి, ప్రభాకర్, రాజశేఖర్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఎంపీపీ

- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసిన బిజెపి నాయకులు





నవతెలంగాణ-నిజాంపేట

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉన్నందున ఎలాంటి ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేయకూడదు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి పనులు చేపడుతున్న ఎంపీపీపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఎంపీపీ ఎన్నికల కోడ్‌ను పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. మండల పరిధిలోని నస్కల్ గ్రామంలోని రోడ్డు వెడల్పులో భాగంగా ఇండ్లను కూలగొడుతున్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన ఎంపీపీపై తగు చర్యలు తీసుకోవాలని మెదక్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశామని బీజేపీ నాయకులు తెలిపారు. ఇంటి యజమానులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇల్లు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లించకుండానే ఇండ్లను కూల్చివేస్తున్నారన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిమ్మనమైన శ్రీనివాస్, రామాయంపేట బీజేపీ మండల ఇంచార్జ్ తీగల శ్రీనివాస్ గౌడ్, రామాయంపేట మండల అధ్యక్షుడు దయానంద రెడ్డి, బీజేపీ మెదక్ టౌన్ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కొనసాగుతున్న రాజీనామాల పర్వం

- బీఆర్ఎస్‌లో చేరిన వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్



నవతెలంగాణ-మెదక్

కాంగ్రెస్ పార్టీలో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. గురువారం మెదక్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో చిన్నశంకరంపేట మండలం వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం చిన్నశంకరంపేట మండలం వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కష్టపడుతూ కాంగ్రెస్ పార్టీని, క్యాడర్‌ను కాపాడుకుంటే కష్టపడిన కార్యకర్తలకు కాకుండా పారాషూట్ నాయకులకు డబ్బులకు అమ్ముడుపోయి టికెట్ ఇచ్చారన్నారు. కష్టపడ్డ కార్యకర్తలకు విలువ లేకుండా పోయిందని మనస్థాపనతో రాజీనామా చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో నికార్సైన కార్యకర్త ఎవరు లేరన్నారు. అంతా రాజీనామాల బాటతో బయటకు వచ్చారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డిని అత్యంత భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సోషల్ మీడియా కన్వీనర్ నవీన్, మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి చేరికలు

- ఆహ్వానించిన ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ- చేగుంట

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో లేవని మెదక్ పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో గురువారం వివిధ పార్టీల నుంచి సుమారు 400 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కొత్త ప్రభాకర్ రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రుక్మపూర్, రెడ్డిపల్లి గ్రామలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారని ప్రభాకర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రం వచ్చాకే, కేసీఆర్ పాలనలో అభివృద్ధి జరిగిందన్నారు. రైతులకు రైతుబంధు, రైతుభీమా, ఉచిత 24 గంటల కరెంటు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీళ్లు అందించామన్నారు. మీ దుబ్బాక ఎమ్మెల్యే బిడ్డగా ఆశీర్వదించాలని, మరొకసారి ఆశీర్వదిస్తే రాష్ట్రంలో కేసీఆర్ పాలన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జెడ్పీటీసీ శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మంచికట్ల శ్రీనివాస్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, వివిధ గ్రామాల కార్యకర్తలు, యువత అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలి

- నర్సాపూర్ మాజీ ఎంపీపీ, అభ్యర్థి రమణారావు



నవతెలంగాణ-చిలిపిచెడ్

టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని నర్సాపూర్ మాజీ ఎంపీపీ అభ్యర్థి రమణారావు కోరారు. టీడీపీ నాయకులు, నర్సాపూర్ మాజీ ఎంపీపీ రమణరావు మండలంలోని ముఖ్య నాయకలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నుంచి పోటీ చేస్తున్నానని, టీడీపీకి ఒక్క సారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యకర్తలు సహకరిస్తే గెలుస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, యాదగిరి, సత్యనారాయణ, యాదగిరి, విష్ణు, శంకరయ్య, దుర్గచలం, అంజయ్య, ఇస్తారి, భిక్షపతి, గోపాల్ రెడ్డి, యాదగిరి, మండలానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖలో సెలక్ట్ అయిన అభ్యర్థులకు సన్మానం



నవతెలంగాణ-చేర్యాల

పోలీస్ సర్కిల్ పరిధిలో పోలీస్ ఉద్యోగాల కోసం పోలీస్‌శాఖ నిర్వహించిన ఉచిత శిక్షణలో శిక్షణ పొంది ఉద్యోగాలకు ఎంపికైన వారిని పోలీస్ అధికారులు సన్మానించారు. మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో గురువారం సీఐ పీ.సత్యనారాయణ రెడ్డి, ఎస్సై యు.భాస్కర్ రెడ్డి, సెకండ్ ఎస్సై రామ్మోహన్‌లు ఉద్యోగాలకు ఎంపికైన వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థిని విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలనే పట్టుదలతో సీపీ ఆదేశాల మేరకు ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహించామన్నారు. ఉచిత శిక్షణ ఫలితంగా ఇద్దరికి సివిల్, ఒకరికి ఎక్సైజ్, ఒకరికి ఫైర్, ఐదుగురికి స్పెషల్ బెటాలియన్, ఇద్దరికి ఏఆర్ ఉద్యోగాలు ఇక్కడ శిక్షణ తీసుకొని వచ్చాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు మాట్లాడుతూ పోలీస్ అధికారులు గ్రామీణ విద్యార్థినీ, విద్యార్థుల అభ్యున్నతికి ఏ కార్యక్రమం చేపట్టినా తమ శాయశక్తుల కృషి చేస్తామన్నారు.

ఓట్లు మావే సీట్లు మావే

- ఎప్పుడు రెడ్లేనా బీసీలు పాలించొద్దా
- వేముల వెంకట ప్రసన్న



నవతెలంగాణ-దుబ్బాక: 'ఓట్లు మావే సీట్లు మావే' అన్న నినాదంతో ధర్మసమాజ్ పార్టీ పోరాటం మొదలుపెట్టిందని ధర్మసమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వెంకట ప్రసన్న అన్నారు. గురువారం దుబ్బాక పురపాలిక కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. గతంలో పాలించిన, ప్రస్తుతం పాలిస్తున్న నాయకుల్లో అత్యధికులు రెడ్లే ఉన్నారని, డాక్టర్ విశారదన్ మహారాజ్ నేతృత్వంలో బహుజను (బీసీ,ఎస్సీ,ఎస్టీ)ల రాజ్యాధికారమే లక్ష్యంగా ధర్మసమాజ్ పార్టీని స్థాపించామన్నారు. నియోజకవర్గ బహుజనులు టార్చి లైట్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. డీఎస్పీ జిల్లా నాయకురాలు మందజ్యోతి, నియోజకవర్గ నాయకులు అనిల్, చందు, కనకరాజు, లక్ష్మణ్, యాదగిరి, నందు, ప్రశాంత్, కరుణాకర్, రాజు తదితరులున్నారు.

కొత్త ప్రభాకర్ రెడ్డితోనే మరింత అభివృద్ధి



నవతెలంగాణ-దుబ్బాక

మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డితోనే దుబ్బాక మరింత అభివృద్ధి చెందుతుందని బీఆర్ఎస్ జిల్లా నాయకులు గన్నె భూమిరెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికల్లో కొత్త ప్రభాకర్ రెడ్డి భారీ మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. గురువారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని 18వ వార్డులో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్ సర్కార్‌ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నాయకులు గోనె మధుసూదన్, జహంగీర్, నియోజకవర్గ హార్ట్ వర్కర్ పండు పలువురున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా వార్డు మునిసిపల్ జవాన్‌కి, పారిశుధ్య కార్మికులకు, వాటర్ లైన్ మేన్స్, మున్సిపల్ కరెంట్ లైన్‌మెన్‌లకు కౌన్సిలర్ తస్లీమ్ బేగమ్ అబ్దుల్ మొయిజ్ కొత్త బట్టలు అందజేసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ కో ఆర్డినేటర్ ముదిగొండ శ్రీనివాస్, నాయకులు గోరేమియా, భాను పాల్గొన్నారు.

ప్రజలందరూ సుభిక్షంగా ఆయురారోగ్యాలతో ఉండాలి

- మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

దుర్గమాత అమ్మవారి దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఆయురారోగ్యాలతో ఉండాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న అన్నారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలోని ప్రగతి నగర్‌లో దుర్గ మాత దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ ప్రతిఏటా దుర్గామాత ఉత్సవాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో దేవీ నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, వైస్ చైర్మెన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి, పున్న సారయ్య, భాస్కర్, వార్డుప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు బట్టల పంపిణీ



నవతెలంగాణ-కొండపాక

కుకునూర్‌పల్లి మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ ఐలం శివ గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన సుమారు వంద మందికి బతుకమ్మ, దసరా సందర్భంగా తన సొంత ఖర్చులతో కొత్త బట్టలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలో ఆనందం ఉంటుందని ప్రతి సంవత్సరం గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన వృద్ధులకు బట్టలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

తీరొక్క పూల పండుగ బతుకమ్మ





నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా పిలిచే తీరొక్క పూల పండుగ మన తెలంగాణ బతుకమ్మ పండుగ అని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాచర్ల వెంకటరమణ కొనియాడారు. కళాశాల సెక్రెటరీ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ఆదేశాల మేరకు రిమ్మనగూడా శివారులో గల సురభి దయాకర్ రావు ఫార్మసీ కళాశాలలో గురువారం కళాశాల విద్యార్థినీలు, సిబ్బందిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బతుకమ్మ అనగానే తెలంగాణ ప్రజలకు ఓ ప్రత్యేకమైన పండగలా భావించి ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా పూలను పూజించే పండగ ఒక్క తెలంగాణలో మాత్రమే కనిపిస్తోం దన్నారు. తెలంగాణ అంటేనే బతుకమ్మ, బతుకమ్మ అంటేనే తెలంగాణ అనే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం పండుగలు నిర్వహిస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది డాక్టర్ శేష ఫణీంద్ర, డాక్టర్ ఆర్. నిర్మల, చెరుకు నరేష్ రెడ్డి, సౌమ్య, సౌందర్య, ఈశ్వర్, పూజిత, భారతి, బి.అరుణ, మజీద్, కృష్ణ, కే. అరుణ, ప్రవీణ్, కరుణాకర్, అనిల్, లింగం, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-కొండపాక

మండల పరిధిలోని ఆరేపల్లి, దుద్దెడ, కొండపాక తదితర గ్రామాల వద్ద నెలకొల్పిన దుర్గామాత విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మండల పరిధిలోని ఆరేపల్లి గ్రామంలో నెలకొల్పిన మండపం వద్ద చండీయాగం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూర్గుల సురేందర్రావు, రవీంద్ర, విశ్వనాథ్ పల్లి సర్పంచ్ లింగారావు పాల్గొన్నారు.

వీరనారి శకుంతల బండార్కర్ స్ఫూర్తిదాయకం

- క్యాంపు కమాండెంట్ కల్నెల్ సునీల్ అబ్రహం





నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

వీరనారి శకుంతల బండార్కర్ స్ఫూర్తిదాయకమని క్యాంపు కమాండెంట్ కల్నెల్ సునీల్ అబ్రహం అన్నారు. గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలుర సముదాయంలో యన్‌సీసీ ప్రత్యేక జాతీయ సమైక్యత, సంయుక్త శిక్షణా శిబిరం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో శకుంతలా బండార్కార్ అన్ని రాష్ట్రాల నుంచి శిబిరానికి హాజరైన కేడేట్స్‌కు దిశా నిర్దేశిక ప్రసంగం చేశారు. ప్రసంగానికి వక్త శకుంతలతో పాటుగా రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ వై వి కే మోహన్, బ్రిగేడియర్ జీ. గోగ్యా, కల్నల్ కే యస్ రావు, లెఫ్టినెంట్ కల్నల్ జీ కే రావు, వీగ శుక్లా, జీ. సుచరితలు బెంగుళూరు, హైదరాబాద్‌ల నుంచి వచ్చి శిబిరాన్ని సందర్శించారు. దేశరక్షణ సమయంలో జమ్మూ కాశ్మీర్ ఉగ్రవాదుల దాడిలో శకుంతల తన భర్తను పోగొట్టుకున్నారని సునీల్ అబ్రహం తెలిపారు. ఆమె ధైర్యం కోల్పోకుండా తన ఇద్దరు కుమారులలో ఒకరిని ఆర్మడ్ ఫోర్సెస్‌లోని ఆర్మీలో, మరొకరిని నేవీలో ఆఫీసర్లుగా తయారు చేశారన్నారు. వారి జీవిత చరిత్రను వీడియో రూపంలో చిత్రీకరించి కేడెట్లకు చూపించారు. 900 మంది కేడేట్‌ల కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యమానికి డిప్యూటీ కల్నెల్ పీ.యస్ నందా, లెఫ్టినెంట్ కల్నల్ పీ.యం రావు, లెఫ్టినెంట్ కల్నల్ పీనాకి, లెఫ్టినెంట్ కల్నల్ రాకేష్ జైశ్వాల్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల యన్‌సీసీ ఆఫీసర్లు, సుబెదర్ మేజర్ పరంజిత్ సింగ్, బెటాలియన్ యన్‌సీసీ ఆఫీసర్లు లెఫ్టినెంట్ డాక్టర్ భవాని, లెఫ్టినెంట్ డాక్టర్ మనోజ్, లెఫ్టినెంట్ డాక్టర్ సుధాకర్, చీఫ్ ఆఫీసర్ మానయ్య పాల్గొన్నారు.

వైభవోపేతంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



నవతెలంగాణ-వర్గల్: రెండో బాసర క్షేత్రంగా ఖ్యాతి గడించిన వర్గల్ విద్యా సరస్వతీ అమ్మవారి సన్నిధిలో ఆదివారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదవ రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఉదయం 5:30 గంటలకు గణపతి పూజతో వేడుకలు మొదలయ్యాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఆలయ వేదపండితుల బృందం గణపతి పూజ అనంతరం అమ్మవారికి అలంకార సేవ నిర్వహించారు. పట్టు వస్త్రాలు సర్వాభారణాలు, పూలమలతో శ్రీ మహాలక్ష్మీ దేవిగా అమ్మవారిని అలంకరించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ఐదవరోజు కావడంతో జంటనగరాల నుండి భక్తులు పోటెత్తారు.

నేత్రపర్వంగా లక్షపుష్పార్చన

శ్రీ మహాలక్ష్మీ దేవిగా కొలువైన అమ్మవారి సన్నిధిలో ముఖమండపం వద్ద భక్తజనం బారులు తీరి కూర్చుని సామూహిక లక్ష పుష్పార్చనలో భాగస్వాము లయ్యారు. అమ్మవారి నామం పఠిస్తూ కనకాం బరం, గులాబీ, చామంతి తదితర పూలను సమ ర్పిస్తూ భక్తిపారవశ్యంతో మునిగిపోయారు. వర్గల్ సరస్వతీ మాత సన్నిధిలో గురువారం చిన్నారుల అక్షరాభ్యాసాలు కొనసాగాయి. నవరాత్రోత్సవ వేళ పంచమి శుభకరంగా భావించి పెద్ద సంఖ్య లో తల్లిదండ్రులు అక్షరాభ్యాసాలకు తరలివచ్చారు.

నేడు చదువుల తల్లి సరస్వతీ దేవిగా

నవరాత్రి ఉత్సవాలల్లో ఆరవ రోజున శుక్రవారం చదువుల తల్లి శ్రీ విద్యా సరస్వతీ అమ్మవారి దర్శనమిస్తారు. ఆ పర్వదినం రోజున అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసాలు స్వీకరిస్తారు. సిరుల తల్లిని భక్తితో దర్శించుకుంటే అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని ఆలయ వేదం పండితులు చెబుతున్నారు

విశ్రాంతి ఉద్యోగులంతా ఏకమవుదాం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న విశ్రాంతి ఉద్యోగులమంతా ఏకమవుదామని, సీఎం కేసీఆర్‌ను మూడోసారి గెలిపిద్దామని విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రవీందర్ రెడ్డి, నాగేశ్వరరావు, లింగారెడ్డి, వై రాజ్యంలు అన్నారు. గురువారం స్థానిక ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా సీఎం కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధితోపాటు విశ్రాంతి ఉద్యోగుల సమస్యలపై తక్షణమే స్పందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఉన్న విశ్రాంతి ఉద్యోగులంతా ఏకమై సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా ఉంటే ఈ స్థాయిలో అభివృద్ధి జరిగేది కాదని ముఖ్యమంత్రి ఉండటం వల్ల ప్రత్యేక నిధుల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని గుర్తు చేశారు. ఏకగ్రీవ తీర్మానాలను స్థానిక ప్రజాప్రతినిధులకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీర్, స్థానిక కౌన్సిలర్ లక్ష్మీ కిషన్ రెడ్డి తదితరులున్నారు.

అడుగడునా ముదిరాజ్‌లకు అన్యాయమే

- గజ్వేల్ నియోజకవర్గ ముదిరాజ్ జేఏసీ చైర్మెన్ రొట్టెల శ్రీనివాస్



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

70 ఏళ్లుగా ముదిరాజులకు అడుగడుగున అన్యాయం జరుగుతుందని గజ్వేల్ నియోజకవర్గ ముదిరాజ్ జేఏసీ చైర్మెన్ రొట్టెల శ్రీనివాస్ అన్నారు. గురువారం గజ్వేల్ నియోజకవర్గ ప్రజ్ఞాపూర్‌లో జేఏసీ ఆధ్వర్యంలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంగా అన్ని పార్టీలు ముదిరాజ్ కార్యకర్తలకు, ప్రజలకు అన్యాయమే జరిగిందన్నారు. చట్టసభల ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ 119 స్థానాలలో ఏ ఒక్కరికి ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. బీసీ డి నుంచి బీసీ ఏ లోకి మార్చమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఏ ప్రభుత్వం ఏర్పాటైనా వెంటనే ముదిరాజులను గుర్తించి ప్రత్యేక రిజర్వేషన్ 8శాతం నుంచి 12శాతం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్‌లు హేమ సురేష్, బోయిని కుమార్, ప్రధాన కార్యదర్శి కుంట సత్యం, కన్వీనర్ పిట్ల సాయి బాబా, వెంగలి వెంకటేష్, జగదేవ పూర్ మహిళా అధ్యక్షురాలు కొన్ని జయమ్మ, ముఖ్య సలహాదారులు ఉప్పరి గోపాల్, లింగ సత్యనారాయణ, శ్రీరామ్ కృష్ణ, బోయిని కృష్ణ, సోషల్ మీడియా కదుల్ల భాస్కర్, తలారి రాజు, బిజీ వెంకటాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చెక్కల నరేష్, భానుచందర్, అంతని వెంకటేష్, నీల కర్ణాకర్, కాటు రాజు, మార్కంటి రాజు, పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి

- ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీ ఎం.రమేష్



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

గజ్వేల్ ఐఓసీలో స్ట్రాంగ్ రూములను ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ పరిశీలించారు. గురువారం ఏసీపీ ఎం.రమేష్ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలో పలుచోట్ల పర్యటించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత ఆదేశాలతో స్ట్రాంగ్ రూంల పరిశీలన, పటిష్టమైన సెక్యూరిటీపై ఏసీపీకు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం త్వరలో రాబోవు సెంట్రల్ ఫోర్స్ అకామిడేషన్ గురించి గజ్వేల్ కోట మైసమ్మ ఆలయం సమీపంలో ఉన్న చాకలి ఐలమ్మ భవనాన్ని పరిశీలించారు. సెంట్రల్ ఫోర్స్ అకామిడేషన్ గురించి అన్ని సదుపాయాలు సమకూర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఇందుకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో అన్ని ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ అదనపు సీఐ రంగకృష్ణ, ఆర్ఎస్ఐ రోహిత్, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు

నవంబర్ 5న మాదిగ యుద్ధభేరి సభ



నవతెలంగాణ-దుబ్బాక

నవంబర్ 5న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద మాదిగల యుద్ధభేరి సభను నిర్వహించడం జరుగుతుందని ఎంఆర్‌పీఎస్, టీఎస్ సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి సిద్దిని రాజమల్లయ్య మాదిగ తెలిపారు. గురువారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు పట్ల కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించడం బాధాకరమన్నారు. ప్రతి మాదిగకు డప్పు, చెప్పు, పెన్షన్ అందించాలని, ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని మాదిగలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ నేతలు చంద్రం, పలువురున్నారు.

అభివృద్ధికి బాటలు వేసిన కేసీఆర్‌కు బాసటగా నిలుద్దాం

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేసిన సీఎం కేసీఆర్‌కు బాసటగా నిలుద్దామని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళిలు అన్నారు. గురువారం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన గజ్వేల్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి పోటీ చేస్తున్నారన్నారు. ప్రతి కార్యకర్త సైనికులుగా పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ హయాంలో గజ్వేల్ అభివృద్ధి ఏ స్థాయిలో జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. బీజేపీ పార్టీలో కనీసం కార్యకర్తలు కూడా లేరన్నారు. కేంద్రం సహకారం లేకున్నా తెలంగాణ రాష్ట్రాన్ని, గజ్వేల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ మాటలు నమ్మేస్థితిలో ఎవరూ లేరన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో మొత్తం 20 వార్డులు ఉన్నాయని అన్ని వార్డుల్లో భారీ మెజార్టీ వచ్చే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్, కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, లక్ష్మీకిషన్ రెడ్డి, రజిత గౌడ్, భాగ్యలక్ష్మీ దుర్గప్రసాద్, బాలమణి శ్రీనివాస్ రెడ్డి, శ్యామల మల్లేశం యాదవ్, ఉప్పల మెట్టయ్య, మరికంటి వరలక్ష్మీ కనకయ్య, అర్చన శివకుమార్, గుంటక శిరీష రాజు, గంగిశెట్టి చందన రవీందర్, మామిడి విద్యా రాణి శ్రీధర్, కూరాకుల శ్రీనివాస్, రహీం, సహిన సమీర్, అత్తిలి శ్రీనివాస్, బొగ్గుల చందు, కోఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు, ఇస్మాయిల్, ఉమర్, కొండ పోచమ్మ డైరెక్టర్లు నిమ్మ రమేష్, గోలి సంతోష్ కుమార్, మార్కెట్ డైరెక్టర్ మతిన్, ప్రవీణ్ కుమార్, ఆత్మ డైరెక్టర్ కూరాకుల సాయి,పార్టీ సీనియర్లు జాఫర్ ఖాన్, నవాజ్ మీరా, విరాసత్ అలీ, హైమద్, తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

5 రకాల పప్పు దినుసులతో 5 అంగుళాల బతుకమ్మ



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు రాష్ట్రస్థాయి కళారత్న అవార్డ్ గ్రహీత రామకోటి రామరాజు 5 రకాల పప్పులతో అరచేతిలో ఇమిడిపోయే 5 అంగుళాల బతుకమ్మను తయారు చేశారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని శనిగే పప్పు, మినపప్పు, కందిపప్పు, ఎర్ర పప్పు, పెసరు పప్పు ఇలా 5 రకాల పప్పు దినుసులతో బతుకమ్మను తయారు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేవుణ్ణి అయినా పువ్వులతో పూజిస్తామని కానీ ఆ పువ్వులకే పూజ చేసే గొప్ప సంస్కృతి మన బతుకమ్మ పండుగని అన్నారు.

విద్య, ఉపాధికై యువత పోరు జేయ్యాలె

- ఏఐవైఎఫ్ 2వ రాష్ట మహాసభల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ
- ఏఐవైఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్



నవతెలంగాణ-అక్కన్నపేట

విద్య, ఉపాధికై యువత పోరు చేయాలని ఏఐవైఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్ కోరారు. గురువారం అక్కన్నపేట మండల కేంద్రంలో ఏవైఎఫ్ రెండవ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి అమలు చేస్తామని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ హామీలను తుంగలో తొక్కిందన్నారు. యువతకు ఉపాధి లేక, విదేశాలకు కూలీలుగా వలసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖలలో అనేక ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేయడం లేదని, దీని మూలంగా ఉపాధి లేని నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఈ నెల 29, 30న జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర 2వ మహా సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బిచ్చాల శ్రీనివాస్, అక్కన్నపేట మండల అధ్యక్షులు మాడుగుల రణధీర్, అశోక్, అజయ్, రమేష్, సాయిరాం, నరేంద్ర, రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి ప్రాజెక్టు వర్కులు ఎంతో దోహదపడతాయి

- ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

విద్యార్థుల అభ్యున్నతికి ప్రాజెక్టు వర్కులు ఎంతో దోహదపడతాయని ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. శ్రీ చైతన్య పాఠశాల రంగధాంపల్లి శాఖ ఎస్ బ్యాచ్ విభాగంలో చదువుతున్న శాన్విక్, ప్రోగ్రాంలో భాగంగా దసరా సెలవుల ప్రాజెక్టును చక్కగా చేసి మెదక్ ఎంపీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులు విద్యార్థుల్లో మానసిక అభ్యున్నతికి ఉపయోగపడతాయన్నారు. శ్రీ చైతన్య పాఠశాలలో ఎస్ బ్యాచ్ విభాగం గురించి విద్యార్థి వివరించగా, ఎంపీ శ్రీ చైతన్య పాఠశాలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జ్యోతి రెడ్డి మాట్లాడుతూ శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థి సర్వతోముఖ అభివృద్ధికి ఎస్ బ్యాచ్ ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్య, ఆర్ఐరాజు, కోఆర్డినేటర్ నాయుడు, అకాడమిక్ డీన్ రాజేంద్రప్రసాద్‌లు శాన్విక్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ బ్యాచ్ ఇంచార్జ్ హనుమాన్, సి బ్యాచ్ ఇంచార్జ్ అశోక్, ప్రైమరీ ఇన్చార్జ్ మహాలక్ష్మి, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ సరిత, ఎఒ, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్ట, ఆరపల్లెలో బతుకమ్మ పనులను గురువారం మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న పరిశీలించారు. బతుకమ్మ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 22 అక్టోబర్ బతుకమ్మ పండుగ, 23 అక్టోబర్ దసరా పండుగను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు పున్న లావణ్య, బొల్లి కల్పన శ్రీనివాస్, మ్యా దరబోయిన శ్రీనివాస్, మేదరబోయిన వేణు, మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న, ఐలేని శంకర్ రెడ్డి, యండి అయూబ్ పాల్గొన్నారు.

ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని రాజగోపాలపేట, నంగునూరు గ్రామాల్లో శరన్నవరాత్రిలో ఉత్సవాల్లో భాగంగా డియర్ ఫ్రెండ్స్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నాలుగవ రోజు దుర్గమ్మ వారు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మొదటి సంవత్సరం దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. పురోహితుల ఆధ్వర్యంలో దుర్గామాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆ అమ్మ వారిని వేడుకున్నామన్నారు. దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో దేవి శరన్నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్న నిర్వాహకులు అమ్మవారి కృపాకటాక్షలు పొందాలని, ప్రతి ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు మహిళలు యువకులు పలువురు పాల్గొన్నారు.

అధిక ధరలకు కొబ్బరికాయల అమ్మకంపై ఫిర్యాదు

నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో టెండర్ దారులు అధిక ధరలకు కొబ్బరికాయలు అమ్ముతున్నారని ఓ భక్తుడు ఆలయ కార్యాలయంలో ఏఈఓ వైరాగ్యం అంజయ్యకు బుధవారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టెండర్ నిబంధనల ప్రకారం ఒక్క కొబ్బరికాయ రూ.30లకు అమ్మాల్సి ఉండగా నిబంధనలను పట్టించుకోకుండా గుత్తేదారు ఒక్క కొబ్బరికాయను రూ.40లకు అమ్ముతున్నారని భక్తుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న గుత్తేదారుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేశారు.

ఫోక్సో కేసులో నేరస్తునికి 7 సంవత్సరాల జైలు శిక్ష

నవతెలంగాణ-మద్దూరు

ఫోక్సో కేసులో దూల్మిట్ట మండలంలోని బైరాన్ పల్లి గ్రామానికి చెందిన జన్యంజన్ను రమేష్‌కు అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ జడ్జీ ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5000ల జరిమానా విధించినట్లు చేర్యాల సిఐ సత్యనారాయణ రెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జన్యంజన్ను రమేష్ బర్త్‌డే ఉందని 7 సంవత్సరాల పాపను ఇంటిలోకి తీసుకొని వెళ్ళి అసభ్యంగా ప్రవర్తించగా పాప ఏడ్చుకుంటూ వచ్చి జరిగిన విషయం తన తల్లికి చెప్పడంతో కూతురిపై అసభ్యంగా ప్రవర్తించాడని తల్లి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. అప్పటి ఎస్సై నారాయణ కేసు నమోదు చేసి పరిశోధన చేసి నేరస్తుని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ వేసినట్లు, కేసు విచారణ చేసిన అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ జడ్జి ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరస్థునిపై నేరం రుజువు కావడంతో 7సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించినట్లు తెలిపారు, నేరస్థునికి జైలు శిక్ష పడడానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట్ లింగం తన వాదనలు వినిపించారు. కోర్టు హెడ్‌కానిస్టేబుల్ కిష్టయ్య, కోర్ట్ లైజనింగ్ ఏఎస్ఐ స్వామిదాసు, హెడ్ కానిస్టేబుల్ రాజమల్లులను సీపీ అభినందించినట్లు ఆయన తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం మూలంగా రైతు మృతి



నవతెలంగాణ-మిరుదొడ్డి

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతు మృతి చెందిన సంఘటన మిరుదొడ్డి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సత్తు బాల్‌రెడ్డి (55)తన వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ తీగలు తెగివున్న విషయాన్ని గమనించకుండా తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారని స్థానికులు తెలిపారు. పొలంలో విగతజీవిగా పడి ఉన్న బాల్‌రెడ్డి మృతదేహాన్ని చూసి కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే రైతు మృతి చెందాడని స్థానికులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మిరుదొడ్డి ఎస్సై నరేష్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

- **స్థలం: మేడ్చల్ జిల్లా అంతాయిపల్లి గ్రామంలోని ఎస్ఎన్ ఆర్ వేధా కన్వెన్షన్ ఫంక్షన్ హాల్**
- **సమయం : ఉదయం 10 గంటలకు**
- **సమావేశంలో పాల్గొననున్న సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావులు**

నవతెలంగాణ-గజ్వేల్

బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గం విస్తృత స్థాయి సవేశాన్ని శుక్రవారం నిర్వహించేందుకు మంత్రి హరీష్ రావు నేతృతంలో సన్నాలు జరుగుతున్నాయి. ఈ సమావేశానికి గజ్వేల్ సిట్టింగ్ ఎమ్మెల్యే, సీఎం కేసీఆర్ పాల్గొంటారని కార్యకర్తలకు నాయకులకు సమాచారం చేరడంతో భారీ ఎత్తున తరలిపోవడానికి సిద్ధమవుతున్నారు. గజ్వేల్ నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి పార్టీలో అంతర్గత విభేదాలు, మనస్పర్ధలను పార్టీ కార్యకర్తలు బహిర్గతం చేశారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించే కార్యకర్తల సమావేశానికి ప్రాముఖ్యత ఏర్పడింది. 2018 ఎన్నికల్లో గెలిచిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ పర్యటించలేకపోయారు. దీంతో స్థానిక ప్రజా ప్రతినిధులు పార్టీ సీనియర్లు పార్టీ అధిష్టానంపై తన వైఖరిని బహిర్గతం చేశారు. పార్టీ సీనియర్లను అధిష్టానం గుర్తించడం లేదని నేరుగా నియోజకవర్గంలో గజ్వేల్, కొండపాక, మనోహరాబాద్ మండలాల్లో కార్యకర్తలు నాయకులు సమావేశాలు ఏర్పాటు చేసి తన అంతర్గత సమస్యలను పత్రిక ముఖంగా బయటపెట్టారు.

శుక్రవారం నిర్వహించే గజ్వేల్ పార్టీ శ్రేణుల సమావేశంలో కార్యకర్తలు నాయకులు చెప్పే పలు విషయాలపై సీఎం కేసీఆర్ చర్చించనున్నారు. పూర్తిస్థాయిలో అసంతృప్తిని దూరం చేసేందుకు ప్రయత్నం జరుగుతుంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా గజ్వేల్ నుంచి పోటీలో ఉండగా ఎన్నికల ప్రచారం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం, అభివృద్ధిపై ప్రజలకు వివరించడం, ప్రతిపక్ష పార్టీల ఎత్తుగడలను తిప్పి కొట్టడం, గతంలో కన్నా భారీ మెజారిటీ పొందడం కోసం కేసీఆర్ కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయనున్నారు. మేడ్చల్ జిల్లా అంతాయిపల్లి గ్రామంలోని ఎస్ఎన్ ఆర్ వేధా కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం జరగడానికి ఏర్పాట్లు జరుగుతుండగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనున్నారు. గజ్వేల్ నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ మూడోసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రాతినిధ్యం వహించనుండగా గతంలో కన్నా భారీ మెజార్టీ తీసుకురావాలని గజ్వేల్ పార్టీ శ్రేణులతో ఇప్పటికే మంత్రికి హరీష్ రావు ప్రచారం ముమ్మరం చేశారు. గజ్వేల్‌కు అన్నితానై గత పదేళ్లుగా అనేక రంగాలలో ఊహించని విధంగా సీఎం కేసీఆర్ ఆలోచనలకు ధీటుగా అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. అయితే మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ నుంచి ఎంపిక అయితే ముఖ్యమంత్రి కావడమే కాకుండా గజ్వేల్‌ను ఇంకా పలు అంశాలలో దేశానికి ఆదర్శంగా నిలపడానికి అవకాశం ఏర్పడుతుందని పార్టీ శ్రేణులు నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు. ఇటీవల గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ అసంతృప్తులను ఈ సమావేశానికి పిలిచే అవకాశం లేదని తెలుస్తుంది. గతంలోనే మంత్రి హరీష్ రావు వారికి అనేక సూచన సలహాలు ఇచ్చినా పట్టించుకోకుండా వ్యతిరేకంగా సమావేశాలు ఏర్పాటు చేశారని పార్టీ అధిష్టానం వారిని పూర్తిస్థాయిలో దూరం పెట్టాలని భావించింది.



తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ పండుగ







నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే.పాటిల్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అధికారికంగా బతుకమ్మ పండుగను నిర్వహించారు. ఈ బతుకమ్మ ఉత్సవంలో వందలాది మంది మహిళా ఉద్యోగులు వివిధ రూపాల్లో అలంకరించిన బతుకమ్మలతో వచ్చి బతుకమ్మ పాటలు పాడి, ఆడి కలెక్టరేట్‌కు పండుగ శోభను తీసుకువచ్చారు. ముందుగా జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్ దంపతులు, జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీస్) గరిమ అగ్రవాల్, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి దంపతులు గౌరీమాతకు పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా మహిళలందరికి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ తాను తెలంగాణాకు వచ్చిన తర్వాత 3 సంవత్సరాల కాలం తర్వాత తెలంగాణా వచ్చినంక రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు, ఈ ఉత్సవాల్లో భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు చాలా గొప్పవని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు బతుకమ్మ పండుగలో కనబడుతాయని, ప్రకృతికి ప్రతిరూపం దుర్గామాతను పూజించడం మూలంగా మనసుకు ప్రశాంతంగా ఉంటుందన్నారు. సిపి శ్వేతా మాట్లాడుతూ ప్రతిరోజు ఉద్యోగ బాధ్యతలతో గంభీరంగా ఉండే మహిళ ఉద్యోగుల మొహాలలో ఈ రోజు సంతోషం కనపడుతుందన్నారు, ప్రతిరోజూ మహిళలకు ఒక పండుగ రోజు కావాలని, బతుకమ్మ వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ మాట్లాడుతూ బతుకమ్మలు, మహిళలతో కలెక్టరేట్ ప్రాంగణం శోభయానంగా మారిందని బతుకమ్మ అంటే ఒక శక్తి అని శక్తిని పూలతో పూజిస్తూ తెలంగాణలో బతుకమ్మ పండుగ చేసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కూతురు పద్మజ పాడిన బతుకమ్మ పాట, చిన్నారులు చేసిన నృత్యాలు ఈ ఉత్సవానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయన్నారు. ఈ బతుకమ్మ ఉత్సవాలలో డిఆర్‌ఓ నాగరాజమ్మ, డిపిఓ దేవకీదేవి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సరోజ, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

నిజాం పాలన సాగించిన కేసీఆర్‌ను తరిమికొట్టాలి

- **కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలు అమలు**
- **జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి**



నవతెలంగాణ-మద్దూరు

తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిజాం రజాకార్ల పాలన సాగించారని, కేసీఆర్‌ను ప్రజలు తరిమికొట్టాలని కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మద్దూరు మండల కేంద్రంలో మద్దూరు, దూల్మిట్ట, కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ ద్రోహులుగా ఉన్న నాయకులను కేసీఆర్ తన పంచన చేర్చుకున్నాడని తెలంగాణ కోసం కష్టపడ్డ నాయకులను బీఆర్ఎస్ నుంచి వెళ్లగొట్టారన్నారు. స్థానికుడినైనా తనకు ఈ ప్రాంత కష్టాలు తెలుసునని ఈ ప్రాంతం కానీ వారికి సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి భూ కబ్జాలు చేయించి జనగామ నియోజకవర్గ ధనాన్ని దోచుకుంటున్నారన్నారు. అనంతరం దూల్మిట్ట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీలోకి రిటైర్డ్ ఇరిగేషన్ ఈఈ నారాయణరెడ్డిని, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా మద్దూరు గ్రామంలో బూరుగు రాజు ఆధ్వర్యంలో 150 మంది తోర్నాల, కూటిగల్, గాగిల్లాపూర్, ధర్మారం, రేబర్తి, గ్రామాలలో 400 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడు, బెక్కల్ సర్పంచ్ కూకట్ల బాలరాజు యాదవ్, ఎంపీటీసీలు రాజేశ్వర్ రెడ్డి, నమ్ము, మాజీ సర్పంచ్ కామీడీ జీవన్ రెడ్డి, మేక మల్లేశం, బాలరాజు, బాలయ్య, యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షులు గుండెగోని లలిత, రాచకొండ ఉప్పలయ్య, కామీడీ రమణారెడ్డి, దామోదర్, పద్మారెడ్డి, కనక చంద్రం, శ్రీశైలం పాల్గొన్నారు.

టిఆర్ఎస్ పేరుతో కొత్త పార్టీ

- **గ్యాస్ సిలిండర్ గుర్తు కేటాయించిన ఎన్నికల సంఘం**

నవతెలంగాణ-సిద్ధిపేట

తెలంగాణ రాజ్యసమితి (టిఆర్ఎస్) పేరుతో కొత్త పార్టీకి ఎన్నికల సంఘం అనుమతించింది. ఈ పార్టీ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ట్రాక్టర్ గుర్తును కేటాయించాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు సమాచారం. కానీ కొంతమంది నాయకుల ఒత్తిడి మూలంగా తమకు గ్యాస్ సిలిండర్ గుర్తు వచ్చినట్లు టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తుపాకుల బాల్ రంగం తెలిపారు. ఈ పార్టీ రాకతో బీఆర్ఎస్ పార్టీకి కొత్త తలనొప్పులు వచ్చే అవకాశం ఉన్నాయా అంటే, అవునని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా టిఆర్ఎస్ పార్టీ ఏర్పాటు అయినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాల్లో సిలిండర్ గుర్తుపై పోటీ చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. తప్పనిసరిగా ఐదు శాతం స్థానాల్లో పోటీ చేయాలన్న నిబంధన పెట్టారు.

ట్రాక్టర్ గుర్తును అడిగాము

బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఈ పార్టీని ఏర్పాటు చేశామని టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాలరంగం అన్నారు. రాష్ట్రంలో తమకు అనువైన స్థానాలలో తమ అభ్యర్థులను పోటీలో నిలబెడతామని. తమ పార్టీకి ట్రాక్టర్ గుర్తు కేటాయించాలని ఎన్నికల సంఘాన్ని కోరాగా కొంతమంది అడుకోవడం మూలంగా గ్యాస్ సిలిండర్ గుర్తు వచ్చిందన్నారు.



టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాలరంగం

బీడీ కార్మికుల పిల్లలకు స్కాలర్షిప్

నవతెలంగాణ-దుబ్బాక: బీడీ కార్మికుల పిల్లలు స్కాలర్షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని దుబ్బాక బి.డీ దవాఖాన సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటేష్ తెలిపారు. గురువారం దుబ్బాకలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రభుత్వ అనుమతి పొందిన ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ కోసం నవంబర్ 30 వరకు, ఇంటర్ నుంచి ప్రొఫెషనల్ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ కోసం డిసెంబర్ 31 వరకు వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0120-6619540 ,040-29561297 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. బీడీ కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆర్అండ్ఆర్ కాలనీలో నీళ్ల గోస

- **పట్టించుకోని మిషన్ భగీరథ అధికారులు** • **ట్యాంకర్లతో నీళ్లు సప్లై చేయిస్తున్న సర్పంచ్**

నవతెలంగాణ-ములుగు

ఆరు రోజులుగా మోటర్లు కాలిపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న మిషన్ భగీరథ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ములుగు మండల పరిధిలోని కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామమైన మామిడియాల ఆర్అండ్ఆర్ కాలనీలో గత ఆరు రోజుల నుంచి నీళ్లు రావడం లేదు. మోటార్లను రిపేర్ చేయించమని సర్పంచ్ నగరాన్ని శ్రీనివాస్ గౌడ్ ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని వాపోయారు. పండుగ రోజులు రావడంతో గ్రామస్తులకు ఇబ్బంది ఏర్పడకుండా గ్రామంలో రెండు రోజులుగా మూడు ట్యాంకర్లతో నీళ్లు సప్లై చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు. ఏఈ నందినితో ఎన్నిసార్లు చెప్పిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా మోటార్లను త్వరగా రిపేర్ చేయించి ప్రజల సమస్యలను తీర్చాలని వారు 'నవతెలంగాణ'తో తెలిపారు.





195 స్టీల్ టిఫిన్ బాక్సులు, రూ.62 వేల నగదు సీజ్

- ఎస్సై లింగం





నవతెలంగాణ-తొగుట

195 స్టీల్ టిఫిన్ బాక్సులు, రూ.62 వేల నగదు సీజ్ చేశామని ఎస్సై లింగం తెలిపారు. గురువారం ఎస్ఐ లింగం, ఎఫ్ఎస్టి టీం ఇన్చార్జ్ ఎంపీవో చందన పోలీస్ సిబ్బందితో కలిసి తుక్కాపూర్ గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేశారు. రాయపోల్ మండలంలోని చిన్న మసాన్ పల్లి గ్రామానికి చెందిన ఆవుల దుర్గారెడ్డి ఎలాంటి బిల్స్ లేకుండా 195 స్టీల్ టిఫిన్ బాక్సులు తీసుకొని వెళ్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన జంగిటి నర్సింలు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.62 వేలు తీసుకెళ్ళడంతో ఆ డబ్బును సీజ్ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పోలీస్ కమిషనర్ ఎస్.శ్వేత ఆదేశానుసారం స్టాటికల్ సర్వే లెన్సు టీమ్స్ ద్వారా 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఎస్సై లింగం తెలిపారు. ఎవరైనా డబ్బులు తీసుకుని వెళ్ళేటప్పుడు వాటికి సంబంధించిన పత్రాలు తప్పని సరిగా ఉండాలని తెలిపారు. సీజ్ చేసిన వాటికి సంబంధించిన ధ్రువపత్రాలు చూపించి డబ్బులు రిలీజ్ చేయించుకోవచ్చని సూచించారు.

నేడు జల్సా



నవతెలంగాణ-టేక్మాల్

మొహమ్మద్ మారూఫ్ షాహిద్ అల్లా దర్గాలో ఫైజాని హౌసే ఆజం దస్తగీర్ జల్సా, ప్రతి నెల ఫాతిహా చేస్తారు. శుక్రవారం సాయంత్రం ఫైజాని హౌసే ఆజం దస్తగీర్ జల్సా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలు దర్గా పీఠాధిపతి సయ్యద్ అహ్మద్ నూరుల్లా హుసేని ఖాద్రి ఆధ్వర్యంలో జరుగుతాయి. కుల, మతాలకు అతీతంగా అందరూ పాల్గొంటారు. నాతో మై ఫీల్ సమ, రాత్రి అన్నదాన కార్యక్రమం ఉంటుంది. ముఖ్య అతిథులుగా బిలాల్, జుబేర్, సోఫీ మత పెద్దలు హాజరు కానున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ అండ్ ఎంపీపీ కో ఆప్షన్ షేక్ మజహర్ కోరారు.

ప్రగతి ఒకేషనల్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ- గజ్వేల్

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలను గురువారం ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాల గజ్వేల్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అంబదాస్ మాట్లాడుతూ ప్రకృతిలో మమేకమై నిర్వహించుకునే పండుగ బతుకమ్మ పండుగన్నారు. చెడుపై మంచి విజయం సాధించిన రోజు విజయదశమి అని పండుగల విశిష్టతను తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ చౌదరి మాట్లాడుతూ పూలతో దేవుడిని పూజిస్తారని, పూలని దేవతగా భావించి చేసుకునే ఏకైక తెలంగాణ పండుగ బతుకమ్మ పండుగ అని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం అధిక సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని బతుకమ్మ పాటలతో అలరించారు.

జాతీయ టెన్నిస్ వాలీబాల్ క్రీడాకారునికి చేయుత



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

లక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు చేయూత అందించడం జరుగుతుందని లక్ష్మీ ఫౌండేషన్ అధ్యక్షులు మార్కంటి కనకయ్య ముదిరాజ్ అన్నారు. పట్టణానికి చెందిన టెన్నిస్ వాలీబాల్ క్రీడాకారుడు శ్రీరామ్ యశ్వంత్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీ ఫౌండేషన్ శ్రీరామ్ యశ్వంత్ కుమార్‌కి రూ.3 వేలు ఆర్థిక సహాయం అందించామన్నారు. క్రీడాకారుడు శ్రీరామ్ యశ్వంత్ త్వరలో అక్టోబర్ 21 నుంచి 24 వరకు పూణేలో జరుగు జాతీయ స్థాయి టెన్నిస్ వాలీబాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. త్వరలో జరిగే జాతీయస్థాయి టెన్నిస్ వాలీబాల్ పోటీలలో క్రీడాకారుడు శ్రీరామ్ యశ్వంత్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు కుర్రె మహేందర్ రెడ్డి, కాటు కళ్యాణ్ పాష, ఎం.డి యాకూబ్, పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మర్కుక్: మండల పరిధిలోని శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన చిట్టమైన నర్సింలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం శివారు వెంకటాపూర్ ఎంపిటిసి తుమ్మల లక్ష్మీనర్సమ్మ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మల కనకయ్య ముదిరాజ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట చింతకాయల శ్రీనివాస్, చిట్టమైన మల్లేశం, చిట్టమైన ఇస్తారి, చిట్టమైన సుధాకర్, రసాల వెంకటేష్ , తదితరులున్నారు.

నవతెలంగాణ-చేగుంట: చేగుంట మండలం బోనాల గ్రామలో చాతిరి మల్లయ్య మరణించారు. ఈ విషయం తెలుసుకొని గురువారం పులిమామిడి కిస్టాపూర్ మాజీ సర్పంచ్, బీజేపీ నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ నాయిని రాజగోపాల్ బాధిత కుటుంబానికి తన వంతు ఆర్థిక సహాయంగా 50 కిలోల బియ్యం అందజేశారు. బోనాల గ్రామ బీజేపీ అధ్యక్షులు పుల్లూరు ప్రశాంత్, ఉపాధ్య క్షులు గుండ్ల పోచయ్య, బూత్ సభ్యులు దండు శేఖర్, నాయకులు మురడి స్వామి, బీజేవైఎం ఉపాధ్యక్షులు ఎర్రగుల కుమార్, పాల్గొన్నారు.

నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో గత నాలుగు రోజుల క్రితం బెస్త భూమయ్య అనారోగ్యంతో మరణించగా గురువారం గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు మృతుని కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీటీసీ నంద్యాల బాల్ రెడ్డి చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల మహేష్, మాజీ ఎంపీటీసీ కిష్టా గౌడ్, ఆకుల శ్రీనివాస్, బెస్త స్వామి, రమేష్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.